

నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు


శుక్రవారం

21 నవంబర్ 2025 పేజీలు : 08


ఆర్టీసీని ఆదర్శ సంస్థగా..

## తీర్చిదిద్దుతాం

- జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేశ్ రెడ్డి
- కార్మికుల సంక్షేమమే.. మా మొదటి లక్ష్యం
- స్వచ్ఛ ఆర్టీసీ-అభివృద్ధి పనులకు నెల్లూరులో వేగం
- 45 వేల ఆర్టీసీ కుటుంబాల కోసం సేవలు మరింత బలోపేతం
- నెల్లూరు ఆర్టీసీకి కొత్త రూపు-స్వచ్ఛ భారత్ అవార్డు గర్వకారణం



**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :**

నెల్లూరు రూరల్‌లోని 38వ డివిజన్ హోటల్ మినర్వా గ్రాండ్‌లో గురువారం జరిగిన ప్రెస్ కాన్ఫరెన్స్‌లో ఆర్టీసీ జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేశ్‌రెడ్డి మాట్లాడుతూ.. ఆర్టీసీ అభివృద్ధికి అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్, పార్టీ నాయకత్వానికి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు మాధవ్.. అలాగే పురందేశ్వరికి కృతజ్ఞతలు తెలిపారు. నెల్లూరు జిల్లా లోనే సుమారు 45 వేల కుటుంబాలు ఆర్టీసీపై ఆధారపడుతున్నందున సంస్థను -మిగతా 2లో




అక్రమ గ్రావెల్ తరలింపులో..

## తెలుగు తమ్ముళ్ల హస్తం !

**చోద్యం చూస్తున్న అధికారులు**

పొదలకూరు మండలంలో ప్రతినిత్యం ఏదో ఒక ప్రాంతంలో అక్రమ గ్రావెల్ యదేచ్ఛగా తరలిపోతూనే ఉంది. ఈ క్రమంలోనే మండలంలోని ఇనుకుర్తిలో గురువారం పట్టపగలే ప్రధాన రహదారిపై నూతనంగా నిర్మిస్తున్న ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్‌కు అక్రమంగా గ్రావెల్ తరలించడం జరిగింది. గ్రామానికి సమీపంలోని చెరువు పక్కనున్న అటవీ ప్రాంతం నుంచి జేసీబీని పెట్టి తవ్వకాలు సాగించారు. పదుల సంఖ్యలో ట్రాక్టర్లు పెట్టి గ్రావెల్ తరలించారు. అటవీ ప్రాంతం నుంచి చిన్న కట్టె పుల్ల తేవాలన్న నిబంధనలు ఒప్పుకోవు. అలాంటిది పట్టపగలే గ్రావెల్ తరలిస్తున్నారంటే.. వారి వెనక ఎవరున్నారనే విషయం చర్చనీయాంశంగా మారింది.

**పొదలకూరు, మేజర్‌న్యూస్ :**



మండలంలో ఎక్కడ గ్రావెల్ తరలింపు జరిగినా.. దాని వెనుక తెలుగు తమ్ముళ్ల హస్తం ఉంటుందనే చర్చ జరుగుతోంది. అటవీ ప్రాంతం నుంచి అక్రమ గ్రావెల్ తరలింపులో కూడా ఓ తెలుగు తమ్ముడు తన జేసీబీ పెట్టి దగ్గరుండి మరీ అక్రమంగా గ్రావెల్ తరలించారనేది విశ్వసనీయ సమాచారం. కాగా మండలంలోని తాటిపర్తి వద్దనున్న కనుపూర్ కెనాల్ కట్ట నుంచి గ్రామానికి చెందిన ఓ తెలుగుదేశం నాయకుడు గురువారం తెల్లవారుజాము నుంచి -మిగతా 2లో



వక్ఫ్ ఆస్తుల్లో రూ.20 కోట్లకు పైగా

## మెగా డెవలప్‌మెంట్స్

**అబ్దుల్ అజీజ్ అధ్యక్షతన 8వ వక్ఫ్‌బోర్డ్ సమావేశం**

**నెల్లూరు అర్బన్/క్రైమ్, మేజర్‌న్యూస్ :**

విజయవాడలోని కాళేశ్వర మార్కెట్ వద్ద గల ఏపీ వక్ఫ్ బోర్డ్ కార్యాలయంలో ఏపీ వక్ఫ్‌బోర్డ్ చైర్మన్ అబ్దుల్ అజీజ్ అధ్యక్షతన 8వ బోర్డ్ సమావేశం గురువారం నిర్వహించారు. ముందుగా ఇటీవల సౌదీ అరేబియాలో మృతి చెందిన -మిగతా 2లో



## ఇది ప్రజల్ని ముంచే ప్రభుత్వం

- సర్వేపల్లిలో సోమిరెడ్డి సర్వం దోపిడీ
- మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి ఆరోపణ

**పొదలకూరు, మేజర్‌న్యూస్ :**

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చెప్పినట్లు ఇది మంచి ప్రభుత్వం కాదని, ప్రజలను ముంచే ప్రభుత్వమని మాజీ మంత్రి, వైసిపి జిల్లా అధ్యక్షులు కాకాణి గోవర్ధన్ రెడ్డి ఆరోపించారు. పొదలకూరు మండలం దేగపూడి రాజుపాలెం వద్ద -మిగతా 2లో



పల్లిపాళెం ఉప్పుటేరుపై వంతెన పునర్నిర్మాణానికి

## నిధులు కేటాయించండి

- కనిగిరి రిజర్వాయర్ షట్టర్లు, సదరన్ ఛానల్, ఈస్టర్న్ ఛానల్, పైడేరు ఎస్కేప్ ఛానల్ దెబ్బతిన్న షట్టర్లు మరమ్మత్తులకు నిధులివ్వండి
- పల్లిపాళెం ఉప్పుటేరుపై వంతెన పునర్నిర్మాణానికి సంబంధించి 14 కోట్ల 60 లక్షల అంచనా వ్యయంతో మొమరాండం
- ఇరిగేషన్ మంత్రి నిమ్మల రామానాయుడుతో ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి భేటీ

వివరాలు 2లో

# రోడ్డు ప్రమాదాల నుంచి ప్రజలను కాపాడడమే ప్రధాన లక్ష్యం

- పూర్తిస్థాయిలో ప్రమాదాల నివారణకు చర్యలు
- ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా అమలు చేయండి
- జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల



**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** రోడ్డు ప్రమాదాల నుంచి ప్రజల ప్రాణాలను కాపాడడమే లక్ష్యంగా రోడ్డు ప్రమాదాల నివారణా చర్యలను సత్వరమే చేపట్టాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల అధికారులకు సూచించారు. గురువారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో రోడ్డు భద్రత కమిటీ సమావేశాన్ని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల, ఎస్పీ డాక్టర్ అజిత వేజండ్ల నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాలను అరికట్టడం, ప్రజలకు ట్రాఫిక్ నిబంధనల పట్ల అవగాహన కల్పించేందుకు ప్రత్యేక దృష్టిపెట్టాలని కమిటీలోని అధికారులకు సూచించారు. జిల్లాలో తరచూ ప్రమాదాలు జరిగే ఎంపిక చేసిన ప్రాంతాల్లో ఎన్‌హెచ్ అధికారులు నివారణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో స్పీడ్ బ్రేకర్లు, రేడియం పెయింటింగ్ వేయాలని సూచించారు. బుజబుజనెల్లూరు నుంచి భగత్‌సింగ్ కాలనీ వరకు 9 ప్రమాదభరిత ప్రాంతాల్లో ప్రమాదాలు జరగకుండా అన్ని నివారణ చర్యలు సత్వరమే తీసుకోవాలని ఎన్‌హెచ్ అధికారులను ఆదేశించారు. జాతీయ రహదారి కూడళ్ల వద్ద సైనేజ్ బోర్డులు, సోలార్ బ్లింకింగ్ లైట్లు ఏర్పాటు చేయాలన్నారు. నెల్లూరు ఆర్టీసీ బస్టాండు వద్ద లోపలికి వెళ్లేటప్పుడు, బయటకు వచ్చేటప్పుడు బస్సులు నిలపకుండా చర్యలు తీసుకోవాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. నెల్లూరు నగర పరిధిలోని మద్రాసు బస్టాండు, ఆర్టీసీ, ఆత్మకూరు బస్టాండ్, స్టోన్‌హౌస్‌పేట ప్రధాన కూడళ్ల వద్ద రోడ్డు మార్జిన్ ఆక్రమణలు లేకుండా వీధివ్యాపారులు ఎక్కువ సమయం ఉండకుండా ట్రాఫిక్ నివారణకు మున్సిపల్ కార్పొరేషన్, ట్రాఫిక్ పోలీసులు సంయుక్తంగా పరిశీలించి చర్యలు చేపట్టాలని సూచించారు. నగరంలో పార్కింగ్ ప్రదేశాలను గుర్తించి ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని ట్రాఫిక్ పోలీసులకు సూచించారు. కందుకూరు, ఆత్మకూరు డివిజన్ల పరిధిలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాలపై కలెక్టర్ ఆరాతీశారు. అత్యవసరంగా నివారణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. తొలుత పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలను ఎస్పీ డాక్టర్ అజిత వేజండ్ల వివరించారు.

సమావేశంలో ఏఎస్పీ సౌజన్య, మున్సిపల్ కమిషనర్ నందన్, ఆర్‌అండ్‌బి ఎస్ఈ రామకృష్ణ ప్రసాద్, డిటిసి చందర్, ఎన్‌హెచ్‌ఏ పీడీ ఎంకె చౌదరి, జిల్లా పంచాయతీ అధికారి శ్రీధర్‌రెడ్డి, డ్వామా పీడీ గంగాభవాని, ఆత్మకూరు ఆర్‌డివో పావని, ట్రాఫిక్, పోలీసుశాఖ అధికారులు, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ గ్రావెల్ తరలింపులో.. తెలుగు తమ్ముళ్ల హస్తం !

*(మొదటి పేజీ తరువాయి)*

పదుల సంఖ్యలో ట్రాక్టర్లు పెట్టి మట్టిని అక్రమంగా తరలించారని సోషల్ మీడియాలో ప్రచారం జరిగింది. ఈ విధంగా ప్రకృతి సంపద అక్రమంగా తరలిపోతుంటే.. సంబంధిత అధికారులు పట్టించుకోకుండా చోద్యం చూస్తూ కూర్చుంటే చివరకు ఏమీ మిగలదని ప్రతిపక్ష పార్టీలు విమర్శిస్తున్నాయి. అక్రమ గ్రావెల్ తరలింపుపై అధికార పక్షం ఎలా స్పందిస్తుందో చూడాలి మరి.

## వక్ఫ్ ఆస్తుల్లో రూ.20 కోట్లకు పైగా
# మెగా డెవలప్‌మెంట్స్



*(మొదటి పేజీ తరువాయి)*

42 మందికి సంతాపంగా ప్రత్యేక దువా ప్రార్థన కార్యక్రమం నిర్వహించిన అనంతరం బోర్డ్ సమావేశం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రవేశపెట్టిన అజెండాలపై ఏకగ్రీవ తీర్మానం చేసి, పలు మ్యానేజింగ్ కమిటీలు, ముతవల్లీలను నియమించారు. అనంతరం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వక్ఫ్ ఆస్తుల్లో రూ.20 కోట్లకు పైగా చేపట్టనున్న మెగా డెవలప్‌మెంట్ ప్లాన్స్‌ను ఎన్సీపీఈ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ప్రతినిధులు వక్ఫ్ ప్రాపర్టీస్ యుటిలైజేషన్ ప్లాన్‌ను బోర్డ్ సభ్యులకు సమగ్రంగా వివరించారు. ఈ సందర్భంగా అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా పలు వక్ఫ్ స్థలాల్లో అభివృద్ధి పనులు ప్రారంభించేందుకు బోర్డు అంగీకరించిందని వాటికి సంబంధించి 20 కోట్లకు పైగా మెగా డెవలప్మెంట్ ప్లాన్స్ వివరాలను ఎన్సీపీఈ సంస్థ వారు వివరించారని తెలిపారు. సదరు ప్రతిపాదనలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని, ప్రభుత్వం అనుమతి, సహకారంతో ముందుకు వెళ్తామని తెలిపారు. ఈ ప్రణాళికలు అమల్లోకి వస్తే, వక్ఫ్ ఆదాయం గణనీయంగా పెరుగుతుందని, ముస్లిం సమాజం బాగుపడుతుందని తెలిపారు. ఒక వక్ఫ్‌సంస్థ నిధులను రుణంగా తీసుకుని, మరొక వక్ఫ్ సంస్థ ఆస్తుల అభివృద్ధికి ఉపయోగించేలా తీర్మానించామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వక్ఫ్ ఆస్తులను కాపాడుతూ.. వాటి ద్వారా సమాజానికి ఉప యోగపడే ప్రాజెక్టులను చేపడతామని తెలిపారు. సమావేశంలో బోర్డ్ సభ్యులైన శాసనమండలి సభ్యులు రుహుల్లా, శాసనసభ్యులు మొహమ్మద్ నసీర్, ఖాజా, అక్రమ్, ఇస్మాయిల్ బేగ్, ఆఫియా, ముక్రం హుస్సేన్, బేపారి జాకీర్‌అహమద్, సీఈఓ మొహమ్మద్ అలీ, అధికారులు పాల్గొన్నారు.

# పల్లిపాళెం ఉప్పుటేరుపై వంతెన పునర్నిర్మాణానికి నిధులు కేటాయించండి

**ఇరిగేషన్ మంత్రి నిమ్మల రామానాయుడుతో ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి భేటి**

**ఇందుకూరుపేట, మేజర్‌న్యూస్ :** ఇందుకూరుపేట మండలంలోని సముద్ర తీర గ్రామాలైన గంగపట్నం, పల్లిపాళెం మరియు మైపాడు గ్రామాలను అనుసంధానం చేసే పల్లిపాళెం ఉప్పుటేరు పై బ్రిడ్జ్ నిర్మాణం చేపట్టాలని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి కోరారు. నీటి పారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుని కలిసి 14 కోట్ల 60 లక్షల అంచనా వ్యయంతో మంత్రికి మొమరాండం అందచేశారు. 2021లో నివార్ తుఫాను కారణంగా వచ్చిన భారీ వరదల కారణంగా వంతెన ధ్వంసమైన విషయాన్ని ఆమె మంత్రి దృష్టికి తెచ్చారు. వరదల్లో బ్రిడ్జ్ కొట్టుకుపోయాక పొలాలకు వెళ్లే రైతులు, సముద్రంలో వేటకెళ్లే మత్స్యకారులు, పాఠశాలలకు వెళ్లే విద్యార్థుల తీవ్ర యిబ్బందులు పడుతున్నారని తెలిపారు. గంగపట్నం, పల్లిపాళెం మరియు మైపాడు గ్రామాల ప్రజల అవసరరాలను దృష్టిలో వుంచుకొని పల్లిపాళెం ఉప్పుటేరు బ్రిడ్జ్ పునరనిర్మాణానికి నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి విజయవాడలోని క్యాంప్ కార్యాలయంలో ఇరిగేషన్ మంత్రి నిమ్మల రామానాయుడుని కలిసి వినతిపత్రం అందచేశారు. అనంతరం కనిగిరి రిజర్వాయర్ షట్టర్లు, సదరన్ ఛానల్, ఈస్టర్న్ ఛానల్, పైడేరు ఎస్కేప్ ఛానల్ దెబ్బతిన్న షట్టర్లు మరమ్మత్తులకు నిధులు మంజూరు చేయవలసిందిగా ఆమె మంత్రి నిమ్మలకు మనవి చేశారు. పెన్నా డెల్టా పరిధిలోని సాగునీటి సమస్యలను మంత్రి దృష్టికి తెచ్చారు. ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డితోపాటు పెన్నా డెల్టా ఛైర్మన్ జెట్టి రాజగోపాల్ రెడ్డి కూడా మంత్రిని కలిశారు.

# ఆర్టీసీని ఆదర్శ సంస్థగా తీర్చిదిద్దుతాం

*(మొదటి పేజీ తరువాయి)*




మరింత ప్రజలకు చేరువ చేసే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. కార్మికుల సంక్షేమమే తమకు ప్రథమ కర్తవ్యమని చెప్పిన సురేశ్ రెడ్డి.. జిల్లావ్యాప్తంగా 3 నెలలకు ఒకసారి మెడికల్ క్యాంపులు నిర్వహిస్తున్నట్టు, వచ్చే జనవరిలో భారీ స్థాయిలో మెగా మెడికల్ క్యాంప్ నిర్వహించనున్న ట్టు తెలిపారు. ప్రమాదాల్లో గాయపడిన ఉద్యోగులకు అత్య వసర సహాయంగా ఆర్టీసీ తరఫున 2.90 లక్షల వరకు ఆర్థికసాయం అందిస్తున్నామన్నారు. ఈఎస్ఐ, పీఎఫ్ వంటి బెనిఫిట్స్‌పై ఉద్యోగులకు అవగాహన కల్పించేం దుకు ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు వెల్లడించారు. ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పరంగా కూడా విశేష మార్పులు చేసినట్లు సురేశ్ రెడ్డి తెలిపారు. ఎన్నో ఏళ్ల నిర్లక్ష్యం కారణంగా దుర్వస్థితిలో ఉన్న నెల్లూరు మెయిన్ బస్ స్టాండ్‌ను పూర్తిగా పునరుద్ధరించి స్వచ్ఛ భారత్ అవార్డు అందుకునేలా మార్చినట్టు చెప్పారు. బస్ స్టాండ్స్‌లో పెయింటింగ్స్, యూనిఫార్మ్స్, రెస్ట్ రూమ్స్, డస్ట్ బిన్స్, ప్లాంటేషన్, దాతల సహకారంతో ఆర్‌ఓ ప్లాంట్లు ఏర్పాటు చేసినట్టు వివరించారు. జిల్లాలోని ఏడుగురు డిపోలు శుభ్రత, పునరుద్ధరణ పనులతో మారుతున్నాయని, త్వరలోనే మొత్తం 27 డిపోల్లో, 5 జిల్లాల్లో స్వచ్ఛ ఆర్టీసీ మోడల్‌ను అమలు చేయనున్నట్టు ప్రకటించారు. పీపీపీ విధానంలో సమాజం నుంచి వచ్చిన సహకారాన్ని అభినందించిన సురేశ్ రెడ్డి.. లలితా, అపోలో, స్థానిక దాతలు కలిసి చేస్తున్న సహకారం వల్ల సంక్షేమ కార్యక్రమాలు విస్తరించాయని తెలిపారు. భవిష్యత్తులో టౌన్ సర్వీస్ విస్తరణతో పాటు ఎలక్ట్రిక్/బ్యాటరీ బస్సులు కొనుగోలు చేసి ఇంధన వ్యయాన్ని తగ్గించడంపై దృష్టి పెట్టినట్టు వెల్లడించారు. రిటైర్డ్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న గ్రాట్యుటీ, పెన్షన్ సమస్యలపై ప్రభుత్వంతో చర్చలు కొనసాగుతున్నాయని చెప్పారు. 'ఆర్టీసీ ఒక ప్రజాసేవా సంస్థ. ఇక్కడి ప్రతి ఉద్యోగి మా కుటుంబ సభ్యుడే. నెల్లూరు జోన్‌కు రాష్ట్రంలో ప్రత్యేక గుర్తింపు రావాలని, కార్మికులకు మరింత భరోసా కల్పించే సేవలు అందించాలని సంకల్పించాం' అని సన్నపు రెడ్డి సురేశ్ రెడ్డి తెలిపారు.

# ఇది ప్రజల్ని ముంచే ప్రభుత్వం

*(మొదటి పేజీ తరువాయి)*

మూడు రోజుల క్రితం కూలిన కల్వర్టు ప్రాంతాన్ని గురువారం ఆయన కార్యకర్తలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కాకాణి మాట్లాడుతూ కల్వర్టు కూలిన నెల్లూరు – రాపూరు ప్రధాన రహదారి కడప, తిరుపతి జిల్లాలను కలుపుతుందన్నారు. ఈ రహదారిపై వేలాది మంది ప్రజలు ప్రతి నిత్యం రాకపోకలు సాగిస్తుంటారని తెలిపారు. మొంథా తుఫాన్ సమయంలో కల్వర్టు కూలే పరిస్థితుల్లో ఉందని పత్రికల్లో కథనాలు వచ్చినప్పటికీ ఆర్ అండ్ బీ అధికారులు కానీ ప్రజా ప్రతినిధులు కానీ పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. ఒకవేళ వాహనాలు వెళ్లేటప్పుడు కల్వర్టు కూలి ఏదైనా ప్రాణపాయం జరిగివుంటే ఎవరు బాధ్యత వహించే వాళ్ళని ప్రశ్నించారు. పొదలకూరు కేంద్రం నుంచి రాపూరు, కలువాయి, సంగం, మనుబోలు ప్రాంతాలకు వెళ్లే రహదారులు వైసీపీ హయాంలో తాను మంత్రిగా, ఎమ్మెల్యేగా వేసినవేనన్నారు. ఏడాదిన్నర కూటమి పాలనలో శాశ్వత ప్రాతిపదికన ఒక్క పనైనా చేశారా, చెప్పగలరా అంటూ సోమిరెడ్డికి సవాల్ విసిరారు. సర్వేపల్లిలో సోమిరెడ్డి, ఆయన కొడుకు మట్టి నుంచి బూడిద వరకు సర్వం దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. ఈ ప్రాంతానికి ఎందరో ప్రజా ప్రతినిధులు ప్రాతినిధ్యం వహించారని, అయితే పొదలకూరులోలే అవుట్ల నిర్వాహకుల వద్ద డబ్బులు వసూలు చేసిన ఘనత మాత్రం సోమిరెడ్డికే దక్కుతుందన్నారు. సోమిరెడ్డి కొడుకు గొలగమూడిలో ఒక సంత పెట్టి వారి నుంచి నెలకు రూ.5లక్షలు వసూలు చేస్తున్నాడని ఆరోపించారు. చివరకు సోమిరెడ్డి, సోమిరెడ్డి కొడుకు తీరుని చూసి పోలీసు యంత్రాంగం కూడా పెదవి విరుస్తోందన్నారు. చంద్రబాబు చెప్పినట్లు సోమిరెడ్డి సంక్షోభంలో అవకాశాలు వెతుక్కునే వ్యక్త అని, మొంథా తుఫాన్ సమయంలో ఎక్కడ దొంగ బిల్లులు పెట్టుకోవచ్చా.. అని గొడుగు వేసుకుని మరీ వెంపర్లాడారని ఆరోపించారు. సర్వేపల్లి నియోజకవర్గంలో ఏయే గ్రామంలో ఎంతెంత మొత్తం పనులు చేయకుండానే దొంగ బిల్లులు చేసుకున్నారనే విషయమై త్వరలో ప్రజల ముందు పెడతానని తెలిపారు. కాకుటూరు వద్ద శివాలయం భూములను రూ.కోటికి అమ్మేసిన ఘనుడు సోమిరెడ్డి అన్నారు. సోమిరెడ్డికి సంపాదన తప్ప ప్రజల సంక్షేమం, అభివృద్ధి పట్టదన్నారు. సోమిరెడ్డి మెహర్బానీ కోసం కొందరు ఎగిరెగిరి పడుతున్నారని వాళ్లు రేపటి రోజు ఒకటి ఉందనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. అధికారం మారిన రోజు తట్టుకోలేరని, ఒళ్ళు దగ్గర పెట్టుకొని మసలుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు బచ్చల సురేష్ కుమార్ రెడ్డి(చిన్ని), రావుల ఇంద్రసేన్ గౌడ్, గోగిరెడ్డి గోపాల్ రెడ్డి, కోనం బ్రహ్మయ్య, పెదమల్లు రమణారెడ్డి, వాకాటి శ్రీనివాసులురెడ్డి, కేతు రామిరెడ్డి, షేక్ అంజాద్, గంగవరపు వేణుగోపాల్ రెడ్డి, చల్లా లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# వీఆర్ఏలకు ప్లే స్కేల్ అమలు చేయాలి



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** రెవిన్యూ శాఖలో సుదీర్ఘకాలం నుండి తక్కువ వేతనంతో పని చేస్తున్న వీఆర్ఏలకు పే స్కేల్ అమలు చేయాలని వీఆర్ఏల సంఘ అధ్యక్షులు ఎస్కే ఖాదర్ బాషా కోరారు. గురువారం వీఆర్ఏలు వారి సమస్యలు పరిష్కరించాలని తహసిల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వీఆర్ఏల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. గ్రామ రెవెన్యూ సహాయకులకు తక్షణమే పే స్కేలు అమలు చేసి జీతాలు పెంచాలన్నారు అర్హత ఉన్న వీఆర్ఏలను వీఆర్వోగా రికార్డ్ అసిస్టెంట్లుగా ప్రమోషన్ ఇవ్వాలన్నారు. ఏళ్ల తరబడి. నామినేగా పనిచేస్తున్న వారిని వీఆర్ఏలగా నియమించాలన్నారు. అటెండర్, నైట్ వాచ్మెన్ ప్రమోషన్ కోటాను 20శాతం నుండి 70శాతం పెంచాలన్నారు. వీఆర్ఏల అక్రమనైటు డ్యూటీలను అటెండర్ డ్యూటీలను రద్దు చేయాలన్నారు. రీ సర్వే పేరుతో వీఆర్ఏలను ఇతర గ్రామాలలో విధించిన డ్యూటీలను తొలగించాలన్నారు. రాష్ట్ర రెవెన్యూ వ్యవస్థలో 19,359 మంది రెవిన్యూ సహాయకులుగా సుదీర్ఘకాలం తక్కువ వేతనంతో పని చేస్తున్నారన్నారు. ప్రజా సమస్యలు పరిష్కారానికి అధికారులకు ప్రజలకు మధ్య ప్రధాన పాత్రలను గ్రామ సహాయకులు చేస్తున్నారన్నారు. గ్రామ రెవెన్యూ సహాయకులు పార్ట్ టైం ఉద్యోగులు అయినా రాత్రి పగలు తేడా లేకుండా పని చేస్తున్నారన్నారు. గత ప్రభుత్వం వీఆర్ఏలకు తీవ్ర అన్యాయం చేసిందని ఒక్క రూపాయి కూడా వేతనం పెంచకపోవడం డీఏని కూడా ఉపసంహరించి రికవరీ చేశారన్నారు. గ్రామ రెవెన్యూ సహాయకుల సమస్యలు పరిష్కరించాలని వారు కోరారు. కార్యక్రమంలో కె.రాంబాబు, బి.సుందరయ్య, జి.నరసింహులు, కే.అంకయ్య, కే.లక్ష్మయ్య, ఎస్కే షరీఫ్, జి.ప్రకాష్‌లు పాల్గొన్నారు.

# నెలలు నిండకుండానే జన్మించే శిశువులపై అవగాహన పెరగాలి

**ప్రీ మేచ్యూరిటీ దినోత్సవం సందర్భంగా మెడికవర్ హాస్పిటల్ డాక్టర్ సురేష్ సలహాలు**



**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** ప్రపంచ 'ప్రీ మేచ్యూరిటీ దినోత్సవం' సందర్భంగా నెల్లూరులోని మెడికవర్ హాస్పిటల్స్ నియోనాటాలజిస్ట్ డాక్టర్ జి.వెంకట సురేష్ మాట్లాడుతూ.. నెలలు నిండకుండానే (37వారాలకు ముందే) జన్మించే శిశువుల ఆరోగ్యం, రిస్కులు, అవసరమైన వైద్య శ్రద్ధ గురించి అవగాహన పెరగాలని సూచించారు. ఈ సందర్భంగా డాక్టర్ సురేష్ మాట్లాడుతూ.. 'ప్రతి సంవత్సరం ప్రపంచవ్యాప్తంగా సుమారు 13 మిలియన్ల శిశువులు నెలలు నిండకుండానే జన్మిస్తున్నారు. భారతదేశం ఈ సంఖ్యలో గణనీయంగా నిలుస్తోంది. ఇలాంటివారి అవయవాలు పూర్తిగా అభివృద్ధి చెందకపోవడంతో పలువురు శిశువులు ప్రత్యేక వైద్య సహాయం అవసరమైన పరిస్థితుల్లో ఉంటారు' అని వివరించారు. నెలలు నిండకుండానే జన్మించే శిశువులు సాధారణంగా ఎదుర్కొనే సమస్యలు గురించి డాక్టర్ వివరిస్తూ శ్వాసకోశ ఇబ్బందులు పాలు జీర్ణం కాకపోవడం, ఇన్ఫెక్షన్లకు అధిక ప్రమాదం మెదడు రక్తస్రావం, గుండె–కాలేయ సమస్యలు, శరీర ఉష్ణోగ్రత నిలకడగా లేకపోవడం, ఎదుగుదల మందగించడం, దృష్టి–వినికిడి సమస్యలు వంటి దీర్ఘకాల ఇబ్బందులు కూడా ఉండే అవకాశం ఉంటుంది అని తెలిపారు. ఇలాంటి శిశువుల ప్రాణాలను కాపాడడంలో అత్యాధునిక ఎన్ఐసీయు సదుపాయాలు, వెంటనే ఇచ్చే చికిత్స, నిపుణుల పర్యవేక్షణ అత్యంత కీలకమని ఆయన పేర్కొన్నారు. గర్భిణీలు పోషకాహారం, ఐరన్–ఫోలిక్ యాసిడ్ పద్ధతిగా తీసుకోవాలి. రక్తపోటు, మధుమేహం, థైరాయిడ్ సమస్యలు ఉన్నవారు నిరంతర వైద్య పర్యవేక్షణలో ఉండాలని తెలిపారు. గర్భధారణ సమయంలో ఒత్తిడి, పొగ త్రాగడం, మద్యం వంటి హానికర అలవాట్లను పూర్తిగా నివారించాలి అని తెలిపారు. పుట్టిన వెంటనే తల్లిపాలు ఇవ్వడం శిశువు ఆరోగ్యానికి చాలా కీలకము అన్నారు. 'నెలలు నిండకుండానే జన్మించే ప్రతి శిశువుకు సమయానికి శ్రద్ధ, అత్యుత్తమ చికిత్స, కుటుంబ మద్దతు అందితే, వారు ఆరోగ్యకరమైన భవిష్యత్తు సాధించగలరు' అని డా.సురేష్ పేర్కొన్నారు.

## అన్నదాత సుఖీభవ పథకంతో రైతన్నలలో హర్షం



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ పథకాలతో రైతన్నలలో హర్షం వ్యక్తమవుతుందని సొసైటీ చైర్మన్ చల్లా వెంకటేశ్వర్లు యాదవ్ తెలిపారు. బుధవారం విడుదల చేసిన అన్నదాత సుఖీభవ పిఎం కిసాన్ యోజన పథకం ద్వారా ఒక్కో రైతులకు రూ.7వేలు పొందడంతో సంతోషంగా ఉన్నారన్నారు. వింజమూరు మండలంలో అన్నదాత సుఖీభవ పథకం ద్వారా 4889 మంది రైతులకు రూ.5వేల రూపాయలు 2కోట్ల 44లక్షల 45 వేల రూపాయలు అందించడం జరిగిందని తెలిపారు. అలాగే పిఎం కిసాన్ పథకం ద్వారా 4018 మంది రైతులకు 2వేల రూపాయలు వంతున 80,36,000 రూపాయలను రైతులకు అందించారన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా ఒక రైతులకు రూ.7వేల రూపాయలు అందడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నట్లు ఆయన తెలిపారు. భవిష్యత్తులో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రైతన్నల పక్షపాతిగా వారి అభ్యున్నత కోసం అనేక కార్యక్రమాలలో చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. అలాగే ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ నిరంతరం నియోజకవర్గ అభివృద్ధితో పాటు రైతన్నల సంక్షేమం కోసం పాటుపడుతున్నట్లు తెలిపారు.

# పౌరసరఫరాల గోదామును తనిఖీ

**కావలి ఆర్డీఓ టి.వంశీకృష్ణ**



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** వింజమూరులోనే పౌరసరఫరాల గోదామును కావలి ఆర్డీఓ టి.వంశీకృష్ణ తనిఖీ చేశారు. నెలవారి తనిఖీలలో భాగంగా ఈ తనిఖీని నిర్వహించినట్లు ఆయన తెలిపారు. గోదాములోని సరుకు నిల్వ రికార్డులను పరిశీలించి ఏఏ సరుకు ఎంత నిల్వ ఉందో పరిశీలించారు. ముందుగా తహసిల్దార్ కార్యాలయంలోని ప్రజా విజ్ఞప్తుల సందర్భంగా ప్రజలు అందించిన దరఖాస్తులు ఎన్ని పెండింగ్లో ఉన్నాయో అని పరిశీలించి వెంటనే పరిశీలించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ ఎస్ఎం హమీద్ కార్యాలయం సిబ్బంది గోదాము సిబ్బంది తదితరులు ఉన్నారు.

## వయో వృద్ధులకు రక్షణ చట్టంపై అవగాహన



**కావలి మేజర్ న్యూస్ :** పట్టణంలో అముదాలదిన్నె కాలనీలో వయో వృద్ధులకు రక్షణ చట్టం మీద న్యాయ విజ్ఞాన సదస్సును గురువారం న్యాయవాది సాయిప్రసాద్ ఆధ్వర్యంలో న్యాయమూర్తి ఏ.గీతవాణి ఆదేశం మేరకు నిర్వహించారు. అనంతరం సాయిప్రసాద్, మాలకొండరెడ్డి మాట్లాడుతూ.. నిర్లక్ష్యం చేస్తే చట్టపారమైన శిక్షలు ఉంటాయని సేవాధికార సంస్థ ద్వారా వచ్చేత న్యాయ సహాయం అందవచ్చునని తెలిపారు. కార్యక్రమం మీద ప్రజలకు అవగాహన నిర్వహించారు. గిరిజన కాలనీలో ఉన్న పిల్లలందరినీ బడికి పంపించాలని, సమాజంలో గౌరవంగా జీవించాలని సాయిప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో ఎల్లంపల్లి రమణయ్య, ఎంకమ్మ, ఎల్లంపల్లి చెంచమ్మ, శాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

## కాటంరెడ్డి వర్ధంతి సందర్భంగా రక్తదాన శిబిరం



**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్ రెడ్డి తండ్రి కాటంరెడ్డి ఆదినారాయణ రెడ్డి 44 వర్ధంతి కార్యక్రమాలను కావలి ఏరియా వైద్యశాలలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కావలి రూరల్ ప్రాంతాల నుంచి పట్టణం నుంచి అనేకమంది అభిమానులు వైసిపి నాయకులు కార్యకర్తలు భారీగా తరలివచ్చి ఈ రక్తదాన శిబిరంలో పాల్గొన్నారు. అలాగే రోగులకు పండ్లు పంచిపెట్టారు. అనంతరం అభిమానులు మాట్లాడుతూ.. కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి తండ్రి కాటంరెడ్డి ఆదినారాయణరెడ్డి చేసిన సేవలను కొనియాడారు. తన తండ్రి గొప్ప మహోన్నత వ్యక్తిగా వారు అభివర్ణిస్తూ వివరించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు కాటంరెడ్డి అభిమానులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## రైతులు ఆనందమే కుటమి ధ్యేయం : బొజ్జ శ్రీను

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను ఒక్కొక్కటి హామీలను అమలు చేస్తూ ముందుకు వెళుతున్న ప్రభుత్వం కూటమి ప్రభుత్వమని నియోజకవర్గ టీఎన్‌టీయుసీ అధ్యక్షులు బొజ్జ శ్రీనివాసులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పిన విధంగా అన్నదాత సుఖీభవ రెండో విడత నిధులు రైతులు ఖాతాలో రూ.7వేల రూపాయలు జమ చేయడం జరిగిందన్నారు. అంతేగాక రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో సంక్షేమా అభివృద్ధి పనులతో ముందుకు సాగుతుందన్నారు. గత రెండు రోజుల క్రితం విశాఖపట్నంలో జరిగిన రాష్ట్రానికి పెట్టుబడులు పెట్టడానికి పరిశ్రమ యాజమాన్యం ఇతర దేశాల నుంచి వచ్చి అనేక కంపెనీలు పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చాయని తెలిపారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పరిచేందుకు ముందు రాష్ట్రాన్ని అభివృద్ధి పరిచేందుకు ముందు చూపు ఉన్న ఏకైక నాయకుడు చంద్రబాబు అన్నారు. అంతేగాక ఉదయగిరి నియోజకవర్గం ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఉదయగిరి నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లుతున్నారన్నారు. నియోజకవర్గంలో పరిశ్రమలు పెట్టేందుకు ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారన్నారు.

## వీఎస్‌యూలో స్పాట్ అడ్మిషన్లు ప్రారంభం

**వెంకటాచలం, మేజర్‌న్యూస్ :** విక్రమ సింహపురి విశ్వవిద్యాలయంలో ఖాళీగా ఉన్న డిగ్రీ, ఇంటిగ్రేటెడ్ కోర్సుల సీట్ల భర్తీ కోసం స్పాట్ అడ్మిషన్లు ప్రారంభమయ్యాయి. నవంబర్ 24, 2025 వరకు దరఖాస్తులు స్వీకరిస్తారని డీఓఏ డైరెక్టర్ డాక్టర్ ఎం.హనుమారెడ్డి తెలిపారు. బీ.కామ్(సీఏ), బీబీఏ (లాజిస్టిక్స్), బీఎస్సీ, ఇంటిగ్రేటెడ్ బయోటెక్నాలజీ, ఫుడ్ టెక్నాలజీ, మైక్రోబయాలజీ, బయోఇన్ఫర్మేటిక్స్, బీఏ పొలిటికల్ సైన్స్ వంటి కోర్సుల్లో సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఆసక్తిగల వారు vsu.ac.in ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

# అంబేద్కర్ జీవిత చరిత్రను పాఠ్యాంశంగా చేయాలి

**వింజమూరు, మేజర్‌న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ దళిత మహాసభ లక్ష కార్డుల ఉద్యమంలో భాగంగా ఏపీ దళిత మహాసభ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి డాక్టర్ కత్తి పద్మారావు మాట్లాడుతూ.. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జీవిత చరిత్రను పాఠ్యాంశంగా చేయాలని కోరారు అంతే కాకుండా ఆరవ తరగతి నుండి పోస్ట్ గ్రాడ్యుయేషన్ వరకు పాఠ్యాంశంగా చేయాలన్నారు. అలాగే అంబేద్కర్ స్మృతివనాలు అధ్యయన కేంద్రాలు ప్రతి పంచాయతీలోనూ ఏర్పాటు చేయాలని అమరావతిని 1000 కోట్లతో అంబేద్కర్ బౌద్ధ క్షేత్రంగా తీర్చిదిద్దాలని అలాగే విజయవాడలో ఉన్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ స్మృతి వనాన్ని ప్రపంచ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని, రాష్ట్రం లోని ప్రతి పాఠశాలలోనూ ప్రభుత్వ కార్యాలయం లో బిఆర్ అంబేద్కర్ చిత్రపటాన్ని ఉంచాలని తెలిపారు. ప్రతి సంవత్సరం ఏప్రిల్ 14వ తేదీన అంబేద్కర్ జయంతి సందర్భంగా అంబేద్కర్ జాతీయ అవార్డులు సముచితమైన రీతిలో ప్రకటించాలని భారత రాజ్యాంగ పీఠికను అన్ని పాఠశాలల అసెంబ్లీలో చదవడం తప్పనిసరి చేయాలని కోరారు. అదేవిధంగా సంపూర్ణ మద్యపాన నిషేధం వైపు ప్రభుత్వం అడుగులు వేయాలని అంబేద్కర్ రచనలు ప్రసంగాలను తెలుగులోకి అనువదింపజేసి ప్రచురించాలని కులాంతర వివాహితులకు రక్షణ 10 లక్షల పారితోషికం గృహ వసతి ఉద్యోగ వసతిని కల్పించాలని 1989 ఎస్సీ, ఎస్టీ ప్రివెన్షన్ ఆఫ్ అట్రాసిటీ యాక్టును పక్కాగా అమలు జరపాలని ప్రత్యేక కోర్టుల ద్వారా దళితులపై జరుగుతున్న దాడులను అత్యాచారాలను వెంటనే విచారణ జరిపి శిక్షలు అమలు చేయాలని తెలిపారు. పై అంశాలను పరిశీలించి ఆచరణ బద్ధమైన చట్టం తేవాలని ఆంధ్రప్రదేశ్ దళిత మహాసభ, సామాజిక సాంస్కృతిక అంబేద్కర్ సంఘాల ఆకాంక్షలను అమలుకు కృషి చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో గుజ్జు చెన్నయ్య మోరా పెద్దన్న సాదం శ్రీనివాసులు బూదాల ప్రేమదాసు ఆరికొండ శ్రీనివాసులు ఏ.వంశీ, ఎన్.కృష్ణ, ఎస్.శ్రీనివాసులు, ఎన్.కేశవ తదితరులు ఉన్నారు.



# గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని వీటిని విద్యార్థులు పాఠకులు సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ మండల కన్వీనర్ గూడా నర్సారెడ్డి పేర్కొన్నారు. గురువారం 58వ జాతీయ గ్రంథాలయాల వారోత్సవాలు ముగింపు సందర్భంగా ముఖ్య అతిథులుగా టీడీపీ మండల కమిటీ కన్వీనర్ గూడా నర్సారెడ్డి సర్పంచ్ సృజన కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు మద్దూరి రాజగోపాల్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులకు ప్రస్తుతం డిజిటల్ గ్రంథాలయాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. సామూహిక స్వీయ పఠనం చేయాలన్నారు. గతంలో విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం పరుచుకొని ఎంతో ఉన్నత స్థితికి ఎదిగారు అన్నారు పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే వారికి మంచి వేదికలుగా గ్రంథాలయాలు నిలుస్తాయన్నారు మొబైల్ ఫోన్లు పక్కనపెట్టి ప్రతి ఒక్కరు పుస్తక పఠనం చేస్తే మంచి జ్ఞానం వస్తుందన్నారు. గతంలో ఉన్న మేధావులు మైళ్ళకొలది దూరాలలో ఉన్న గ్రంథాలయాలకు వెళ్లి విజ్ఞాన గ్రంథాలను చదివి మేధావి నైపుణ్యాన్ని పెంపొందించుకున్నారన్నారు. అదేవిధంగా వారి బాటలో విద్యార్థులు ప్రతిరోజు క్రమం తప్పకుండా గ్రంథాలయంకి వచ్చి విజ్ఞాన దాయకమైన పుస్తకాలను చదవాలన్నారు. విజ్ఞానాన్ని పెంపొందించుకొని విలువలు కలిగిన భావి భారత పౌరులుగా ఎదగాలన్నారు. అనంతరం విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీలకు సంబంధించి విజేతలకు బహుమతి ప్రధానం గావించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకుడు దాసరి ప్రసాద్, పీఈటీ మాచర్ల సుమలత మల్లికార్జున, అంజయ్య రాయుడు, ఏగినేని శ్రీనివాస నాయుడు తదితరులు ఉన్నారు.

# రెండు బిర్యానీ హోటల్స్‌ను సీజ్ చేసిన హెల్త్ ఆఫీసర్

**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** జిల్లా న్యాయమూర్తి సూచనలతో నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వైఓ నందన్ ఆదేశాల మేరకు నగరపాలక సంస్థ ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కనకాద్రి నేతృత్వంలో స్థానిక 38వ డివిజన్ జిల్లా కోర్టు సముదాయం ఎదురుగా షాపింగ్ కాంప్లెక్స్ లో నిర్వహిస్తున్న రెండు బిర్యానీ హోటళ్లను ఆరోగ్యశాఖ అధికారి గురువారం సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కనకాద్రి మాట్లాడుతూ.. ఆషాపు యజమానులు బహిరంగంగా షాపులో బిర్యాని, మసాలాలకు సంబంధించి వివిధ ఆహార పదార్థాలు తయారు చేయటం మూలంగా వాటి ఘాటైన వాసనల వల్ల చుట్టుపక్కల వారికి చాలా ఇబ్బందికరంగా ఉందని న్యాయవాదులు, కోర్టుకు వచ్చే కక్షిదారుల ఫిర్యాదుల మేరకు స్పందించామని తెలిపారు. ఫిర్యాదుల మేరకు ఆ షాపుల యజమానులకు ఆహార పదార్థాలనుబయట తయారు చేసుకొని ఇక్కడ విక్రయించుకోవాలని, షాపుల్లో ఎటువంటి తయారీలు చేయవద్దని నోటీసులు జారీ చేశామని తెలిపారు. అయితే ఆ షాపుల యజమానులు నోటీసులను ఖాతరు చేయని కారణంగా ఈనెల 13న మరలా నోటీసులు జారీ చేశామని, అయినను ఆ షాపుల యజమానులు నిర్దేశించిన చర్యలు తీసుకోనందున షాపులను మూసివేయడం జరిగినదని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో శానిటరీ సూపర్వైజర్ నరసింహారావు, సిబ్బంది పాల్గొన్నారు.



## సతీష్ కుటుంబానికి సంఘీభావం : శాలివాహన సంఘం



**కావలి, మేజర్‌న్యూస్ :** గుంటకల్ డివిజన్లో జీఆర్‌పి సీఐగా విధులు నిర్వహిస్తున్న సతీష్ నవంబర్ 14వ తేదీన అనుమానాధాస్పద స్థితిలో మృతి చెందారు. సతీష్‌కి శాలివాహన సంఘం ఆధ్వర్యంలో సంఘీభావం తెలియజేశారు. అనంతరం గురువారం కావలి ఆర్డీఓ కార్యాలయంలో వినతిపత్రాన్ని అందించి వారి కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. అనంతరం శాలివాహన సంఘం వారు మాట్లాడుతూ.. నిజాయితీ పరులైన సతీషు కొంతమంది దుర్మార్గుల చేతిలో అనుమానాస్పద మృతి చెందడం జరిగిందని, వారి కుటుంబానికి న్యాయం చేసేందుకు ప్రభుత్వం సహకరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో శాలివాహన సంఘ కావలి అధ్యక్షులు ఏగూరు పెద్ద పుల్లయ్య, గుడ్లూరు మాల్యాద్రి, చిన్న పుల్లయ్య, బెజవాడ రవీంద్ర, ప్రసన్నకుమార్, లాయర్లు అభి సాగర్, నాగేంద్ర, మన్నేపల్లి చిన్నమాల్యాద్రి, సప్తగిరి తదితరులు పాల్గొన్నారు.

## పరిహారం పంపిణీలో పక్షపాతం



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల కురిసిన హుదూద్ తుఫాను వల్ల ఉపాధి కోల్పోయిన చేనేత కార్మికులను ఆదుకోవాలనే సంకల్పంతో ఉచిత బియ్యం సరుకులు పంపిణీలో పక్షపాతం జరిగిందని బీసీ కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గురువారం కాలనీవాసులు తహసిల్దార్‌ను కలిసి పరిహారం పంపిణీ విషయంపై జరిగిన విషయాలను తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వింజమూరు పంచాయతీ పరిధిలో సుమారు 225 పైచిలుకు చేనేత కుటుంబాలు నివసిస్తున్నాయని. ఇటీవల కురిసిన హుదూద్ తుఫాన్‌తో నేతన్నల్లో ఉపాధి కోల్పోయి పస్తులు ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. కొంతమంది నేత నాయకులుగా చెప్పుకుంటూ పరిహార పంపిణీ విషయంలో వారి కుటుంబ సభ్యులకు వారి బంధువులకు వారి పరిహారం ఇప్పిచ్చారే తప్ప నిజమైన వారికి పరిహారం అందలేదన్నారు. ప్రభుత్వం అధికారులు సమగ్ర విచారణ జరిపి అర్హులకు పరిహారం అందే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.

## స్మార్ట్ స్ట్రీట్ బజారును పరిశీలించిన కమిషనర్



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వైఓ నందన్ స్థానిక జాకీర్ హుస్సేన్ నగర్ ప్రాంతంలో నూతనంగా ఏర్పాటు చేసిన స్మార్ట్ స్ట్రీట్ బజార్ ప్రాజెక్ట్ ప్రాంగణాన్ని గురువారం టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్ విభాగాల అధికారులతో కలిసి పరిశీలించారు. స్మార్ట్ స్ట్రీట్ బజార్ దుకాణాలను అనుసంధానించేలా పాదచారుల మార్గం రూపొందించేందుకు ప్రణాళికలను సంసిద్ధం చేయాలని అధికారులను కమిషనర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు నగర పాలక సంస్థ టౌన్ ప్లానింగ్ విభాగం సిటీ ప్లానర్ హిమబిందు, ఇంజనీరింగ్ విభాగం ఈ.ఈ అనిల్ కుమార్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ చినబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

# హద్దురాళ్లు పీకేస్తారనే భయంతో గ్రామస్తుల కాపలా !

### ఈదురు బిట్టు-1 మల్లికార్జునపురంలో హద్దురాళ్లపై గబ్బిలంలా కన్నేయే రియల్ ఎస్టేట్ వ్యాపారులు



**తోటపల్లి గూడూరు, మేజర్‌న్యూస్ :** మండలంలోని ఈదూరు బిట్టు-1 మల్లికార్జునపురం గ్రామంలో భూమి వివాదంపై పత్రికలలో వచ్చిన కథనాలకు స్పందించిన తాసిల్దార్ ఆదేశాల మేరకు, గురువారం 42, 44 సర్వే నంబర్లలో మండల సర్వేయర్ సర్వే నిర్వహించారు. సర్వే అనంతరం పూర్తివివరాలతో కూడిన నివేదికను త్వరలో తాసిల్దార్‌కు అందజేస్తామని అధికారులు తెలిపారు. సర్వే ప్రాంతంలో కొన్ని హద్దురాళ్లు ఏర్పాటు చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. అయితే ఇవి నిలవవా, మళ్ళీ పీకేస్తారో అన్న ఆందోళన గ్రామస్తుల్లో నెలకొంది. గతంలో కూడా సరిహద్దులను తొలగించే ప్రయత్నాలు జరిగిన నేపథ్యంలో, 'హద్దురాళ్లు పీకేస్తారు' అన్న భయంతో గ్రామస్తులే కాపలా అని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాత్రింబవళ్లు హద్దు రాళ్ల వద్ద కూర్చొని కాపలా కాస్తున్న గ్రామస్తులు.. రియల్ ఎస్టేట్ వ్యాపారులు భూమి సరిహద్దులను మార్చేందుకు ప్రయత్నిస్తారనే అనుమానం వ్యక్తం చేస్తున్నారు. సర్వే ద్వారా ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురై ఉండితే, వాటిని వెంటనే తొలగించి ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుందని అధికారులు స్పష్టంచేశారు. గ్రామస్తులు కోరుతున్నది ఒక్కటే.. 'హద్దురాళ్లు చెక్కుచెదరకుండా నిలవాలి.. ఎవరూ పీకేయకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలి.

# కళాకారులు కళను నమ్ముకోకుండా అమ్ముకుంటున్నారు..



**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరులో ఉన్నత స్థాయిలో ఉన్న కొంత మంది కళాకారులు కళను నమ్ముకోకుండా అమ్ము కుంటున్నారని కళాంజలి శ్రీనివాస్, డాక్టర్ నారాయణ మూర్తి తెలిపారు. గురువారం నెల్లూరు జిల్లా జర్నలిస్ట్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నెల్లూరు జిల్లాలో కళకు, డ్యాన్స్ విషయంలో ఆర్కెస్ట్రా ముసుగులో ముఖ్యంగా ఈవెంట్స్ ముసుగులో రౌడీషీటర్స్, దొంగలు ఇతరత్రా వారు కళను వ్యాపారంగా మార్చి ఇతర రాష్ట్రాల నుండి వందల మంది అమ్మాయిలను కాంట్రాక్టు పద్దతిలో నెల్లూరుకు తీసుకొచ్చి లాడ్జిలలో వ్యాపారం చేస్తున్నారు. మారుమూల ప్రాంతాలలో ఇళ్ళు అద్దెకు తీసుకొని వారికి అక్కడ నివాసం ఏర్పాటు చేసి అసాంఘిక కార్యక్రమాలు, వేదికలపై పోలీసు వారు పర్మిషన్ లేకుండా అశ్లీల నృత్యాలు, అసభ్యకర మాటలు మాట్లాడిస్తూ వాటిని సోషల్ మీడియాలో ఆ వీడియోస్ పోస్ట్ చేసి తద్వారా లబ్ది పొందుతూ మా కళా రంగాన్ని, మా గౌరవ మర్యాదలను, మా విలువలను నాశనం చేస్తున్నారు. దీనివల్ల కొన్ని వేల మంది సంగీత నాట్య కళాకారుల పొట్ట కొడుతున్నారు. ముఖ్యంగా ఎన్నో సంవత్సరాలుగా కళనే నమ్ముకొని బ్రతుకుతున్నటువంటి నెల్లూరు జిల్లా కళామతల్లి ఆడబిడ్డలు తలదించుకొనేలా వాటిని అవమాన పరుస్తున్నారు. జిల్లా సీనియర్ కళాకారులుగా వారితో మేము ఒకటి రెండు సార్లు ఇలా చేయకూడదని చెప్పడం జరిగింది. అయినా వారు మా మాటలు లెక్క చేయకుండా మాపై దౌర్జన్యము చేయుచున్నారు. ఇలాంటి వాళ్ళను ప్రోత్సహిస్తున్న వారికి రాజకీయ నాయకులకు తమ మనవి, కళకు సంబంధం లేని వాళ్ళను, రికార్డింగ్ డ్యాన్సర్లను, ప్రోత్సహించవద్దు. నిజమైన కళాకారులను ప్రోత్సహించాలని కోరారు. దీనిపై జిల్లా ఎస్పీ ఇలాంటి వారిపై చట్టపరమైన చర్యల తీసుకొని కళా కుటుంబాలను బ్రతికించాలని కోరారు. ఈ సమావేశంలో సీనియర్ డాన్స్ మాస్టర్ సామ్యూల్, డాన్స్ మాస్టర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు వ్యాసరచన, ఆటల పోటీలు



**జలదంకి, మేజర్‌న్యూస్ :** నెల్లూరు జిల్లా గ్రంధాలయ సంస్థ నెల్లూరు శాఖ ఆధ్వర్యంలో జలదంకిలో 58వ జాతీయ గ్రంథాలయ ఉత్సవాలు ఈనెల 14 నుంచి 20తో ముగిసాయి. గురువారం జలదంకి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జలదంకి గ్రంధాలయ అధికారిని విజయలక్ష్మి ఆధ్వర్యంలో వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రంథాలయాల విశిష్టతపై పాఠశాల ఉపాధ్యాయులు రచయిత కవి అయిన తిరుక్కోవల్లూరు శ్రీనివాసులు విద్యార్థులకు వివరించడమే కాక జలదంకి మండలం గ్రంథాలయ శాఖ సభ్యత్వం పొంది గ్రంథాలయాల పట్ల తనకున్న గౌరవాన్ని అభిరుచిని తెలియజేశారు. విద్యార్థులకు ప్రతిజ్ఞతో ప్రారంభమై, వ్యాసరచన పోటీలు ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం విద్యార్థులకు మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ నాగేశ్వరరావు, ఎలిమెంటరీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఇమానియలు, ఉన్నత పాఠశాల హెచ్ఎం విద్యావతి, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

## సేవలో వీఎస్‌యూ, ఎన్ఎస్ఎస్ ముందడుగు..



**వెంకటాచలం, మేజర్‌న్యూస్ :** విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం (వీఎస్‌యూ) ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో బీవీ నగర్‌లోని డామియన్ ఫౌండేషన్ అర్బన్ లెప్రసీ అండ్ టిబి సెంటర్‌లో లెప్రసీ బాధితులకు అవసరమైన ధాన్యం, ఎంసీఆర్ పాదరక్షలను పంపిణీ చేశారు. డల్లాస్ (యుఎస్ఏ)కు చెందిన శ్రీ సంకురి ప్రవీణ్ రాం అందించిన సహాయంతో ఈ సేవా కార్యక్రమం నిర్వహించబడింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన వీఎస్‌యూ వైస్-చాన్సలర్ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు మాట్లాడుతూ.. విద్యార్థుల్లో సేవా భావం పెంపొందించడంతో సమాజానికి అండగా నిలిచే కార్యక్రమాలు మరింత విస్తరించాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ అధికారి డాక్టర్ ఎస్కే ఖాదర్ వలి, వీఎస్‌యూ రిజిస్ట్రార్ (ఐ/సి) డాక్టర్ కె.సునీత, కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య సీహెచ్ విజయ, డీఎఫ్ఐటి ప్రాజెక్ట్ మేనేజర్ సతీష్ పాల్గొన్నారు. సేవా కార్యక్రమాన్ని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డాక్టర్ ఉదయ్ శంకర్ అల్లం సమన్వయం చేశారు. లెప్రసీ బాధితుల్లో గౌరవం, ధైర్యం, ఆశ పెంపొందించడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు.

## కోరిడ్ సంస్థ ఆధ్వర్యంలో మెడికల్ క్యాంప్




**కావలి, మేజర్‌న్యూస్ :** పట్టణంలోని బాపూజీ నగర్‌లో కోరిడ్ సంస్థ ఆధ్వర్యంలో గురువారం ఉచిత మెడికల్ క్యాంపును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సుమారు కావలి నియోజకవర్గంలో నిరుపేద గిరిజన గ్రామాల్లో కోరిడ్ సమస్తలో పనిచేయుచున్న వారికి సుమారు రెండు వందల మందికి ఉచితంగా పరీక్షించి మందులు అందజేశారు. అనంతరం సమస్త వ్యవస్థాపకులు రెవరెండ్ ఆర్.జైపాల్ మాట్లాడుతూ.. సమస్త స్థాపించినప్పటి నుంచి కూడా సమస్తలో పనిచేస్తున్న నిరుపేద గిరిజన గ్రామాలకు ఎన్నో సేవా కార్యక్రమాలు అందిస్తున్నామని ప్రతి ఒక్కరు కూడా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కోరిడ్ సంస్థ సూపర్వైజర్ దంతం సునీల్, సిబ్బంది పాల్గొన్నారు.

## భక్తులందరికీ అయ్యప్ప కటాక్షం ఉండాలి

● అయ్యప్ప స్వామి మహా పడిపూజలో ఎమ్మెల్యే కావ్య



**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి పట్టణంలో స్థానిక ముసునూరు ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో వారి గృహమునందు అయ్యప్ప స్వామి మహా పడిపూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఆధ్యాత్మిక వైభవంతో భక్తులతో ఆ ప్రాంగణమంతా నిండిపోయింది. స్వామియే శరణం అయ్యప్పబి హరి హరి వాసనేబి శరణం అయ్యప్ప అంటూ నినాదాలతో శరణాదున్ని వేడుకున్నారు. ప్రత్యేకంగా అలంకరించిన పూజా మండపం భక్తులను బాగా ఆకట్టుకుంది గురుస్వాముల ఆధ్వర్యంలో శాస్త్రోక్త పూజా కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీ విఘ్నేశ్వరబి సుబ్రహ్మణ్యస్వామిబి అయ్యప్ప స్వాములకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పాలాభిషేకం నియాభిషేకం భక్తుల భక్తి భరితుల్ని చేశాయి. అయ్యప్ప స్వాములు కుటుంబాలతో అధిక సంఖ్యలో హాజరయ్యారు. అనంతరం భక్తులందరికీ తీర్థప్రసాదాలు అన్నప్రసాదాలు పంపిణీ చేశారు ప్రతి ఏర్పాట్లు ఎమ్మెల్యే కావ్య పరిశీలిస్తూ ప్రతి ఒక్కరిని ఆత్మీయంగా పలకరిస్తూ అక్కడ ఏర్పాట్లను పరిశీలించడం జరిగింది. భక్తులందరికీ అయ్యప్ప స్వామి కరుణ కటాక్షం ఉండాలని ఎమ్మెల్యే కావ్య ప్రార్థనలు నిర్వహించారు. అద్భుతంగా జరిగిన ఈ పడిపూజ కార్యక్రమం లో అయ్యప్ప భక్తులు, గురుస్వామిలు, ప్రజలు అందరూ పాల్గొని కార్యక్రమాల్ని విజయవంతంగా నడిపించారు.

## చెన్నవరప్పాడుకు త్వరలోనే బస్సు సౌకర్యం



**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** సంఘం మండలంలోని చెన్నవరపుపాడుకు త్వరలోనే బస్సు సౌకర్యం కల్పిస్తామని ఆర్టీసీ జోనల్ చైర్మన్ సన్నపరెడ్డి సురేష్ రెడ్డి పేర్కొన్నారు. తన పదవీకాలం సంవత్సరం పూర్తయిన సందర్భంగా నెల్లూరు నగరంలోని హెూటల్ గ్రాండ్ లో ఆయన గురువారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్య రిపోర్టర్ రఘు అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానం ఇస్తూ గతంలో చెన్నవరపుపాడుకు బస్సు సౌకర్యం ఉండేదని కొన్ని కారణాలవల్ల బస్సులను తిప్పలేకపోయామన్నారు. ప్రజల నుంచి వస్తున్న విజ్ఞప్తుల మేరకు తిరిగి సంగం మీదుగా తరుణవాయి, తలుపూరుపాడు మీదుగా చెన్నవరప్పాడుకు బస్సు సర్వీసులను పునరుద్ధరిస్తామన్నారు.

# నిరంతర శ్రామికుడు మంత్రి నారాయణ

## మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ తాళ్ళపాక అనురాధ



**నెల్లూరు అర్బన్/క్రైం, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగర నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు మంత్రి పొంగూరు నారాయణ కృషి చేస్తున్నారని మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ తాళ్ళపాక అనురాధ తెలిపారు. ముందు జాగ్రత్తలల్లో భాగంగా పూడిక తీత పనులు చేపట్టడం వల్లే.. ఇటీవల కురిసిన వర్షాలకు మురుగునీరు సాఫీగా వెళ్లిందని వెల్లడించారు. గురువారం 42 డివిజన్లో కాలువ సిల్ట్ తీసే కార్యక్రమాన్ని ఆమె నిర్వహించారు. డివిజన్లో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలిస్తూ సీల్డ్ తీసే మున్సిపల్ కార్మికులకు పలు సూచనలు చేశారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి కోసం అటు అమరావతి ఇటు నెల్లూరును రాష్ట్రంలో నెంబర్ వన్ స్థాయి వచ్చే విధంగా మంత్రి నారాయణ చేస్తున్న కృషి ఎనలేనిది అని తెలిపారు. మంత్రి నారాయణ నిరంతర శ్రామికుడని మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ తాళ్ళపాక అనురాధ కొనియాడారు. అదేవిధంగా ఎటువంటి వర్షాభావం కలిగిన ఎక్కడ కూడా ఇబ్బంది లేకుండా కాలువలో నీరుపారే విధంగా ముందస్తు ప్రణాళికలతో ముందుకు వెళ్తున్నామన్నారు. నెల్లూరు నగర వ్యాప్తంగా జరుగుతున్న పలు పాఠశాలలను చూస్తే ఎంతో ఆనందంగా ఉందని నెల్లూరు ప్రజలకు మంత్రి నారాయణ చేస్తున్నటువంటి అభివృద్ధికి ప్రజల హర్షం వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. ఆయన ఎమ్మెల్యేగా మంత్రిగా ఉండడం మా అదృష్టం అన్నారు. ఎటువంటి సమస్యలు వచ్చినా తమ వద్దకు వస్తే శాశ్వత పరిష్కారం అందించే విధంగా కృషి చేస్తామని ఈ సందర్భంగా అనురాధ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక టిడిపి నేతలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పరమేశ్వరనికి రుద్రాభిషేకం



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** పట్టణ సమీపంలోని బీసీ కాలనీలో వెలసి ఉన్న శ్రీషిరిడిసాయిబాబా మందిరంలో గురువారం కార్తీకమాసం, అమావాస్య తిథిని పురస్కరించుకుని భక్తులు పరమేశ్వరునికి రుద్రాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు స్వామివారికి పంచామృతాలు. సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అర్చకులు సాయినాథుని, పరమేశ్వరుని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం ఇచ్చారు. భక్తులు స్వామివారికి కాయాకర్పూరం, నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. భక్తుల సౌకర్యార్థం అన్నప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టారు.

# అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించిన కౌన్సిలర్ సూరా



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** పట్టణంలోని క్రిస్టియన్‌పేటలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని గురువారం ఆవార్డుకు ప్రాతినిధ్యం వహిస్తున్న మున్సిపల్ కౌన్సిలర్ సూరా భాస్కర్‌రెడ్డి పరిశీలించారు. ఆయన తమ పరిధిలో ప్రజా సమస్యల పట్ల బాగా స్పందిస్తుంటారు. పాఠశాలలు, హాస్టళ్ళు, అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలిస్తుంటారు. వారికి అవసరమైన పండ్లు, స్వీట్లు తనస్వంత నిధులతో అందజేస్తుంటారు. పారిశుధ్యం మెరుగుకు తానే కార్మికుడిలాగా కాలువలు శుభ్రం చేస్తారు. దోమలనివారణమందును తానే పిచికారీ చేస్తుంటాడు. ఆయన రూటేసెపరేట్‌గా కొనసాగుతుంటారు. కూటమి ప్రభుత్వ పాలనే ఆయనకు ఆదర్శం, మంత్రి ఆనం రామ నారాయణరెడ్డి ఆయనకు అత్యంత సన్నిహితనాయకుడు, మంత్రిమాటే శిరోధార్యంగా భావిస్తుంటాడు. ఆనం చేస్తున్న అభివృద్ధికి ముగ్ధుడవు తుంటారు. ఆయన బాటనే అనుసరిస్తుంటాడు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ స్ఫూర్తితో విద్యాసంస్థలను తరచూ పరిశీలిస్తుంటాడు. కాగా గురువారం అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి అక్కడి చిన్నారుల ముద్దుముద్దు మాటలతో కాలక్షేపం చేశాడు, వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకు న్నాడు. వారితో మాట్లాడడం మధురానుభూతి అని సూరా భాస్కరరెడ్డి పేర్కొ న్నారు. అక్కడి మెనూ, పూర్వప్రాథమికవిద్య, పౌష్టికాహారం గురించి ఆయన అడిగి తులసుకున్నారు. స్థానిక ఐసిడిఎస్ సిడివివో పి.సునీలతతో ఆయన మాట్లాడుతూ.. ఏదేని సమస్యలుంటే మంత్రి ఆనం దృష్టికి తీసుకెళ్ళి పరిష్కా రానికి తనవంతుగా కృషి చేస్తానని సూరా పేర్కొన్నారు. చిన్నారులకు బిస్కె ట్లు, చాక్లెట్లు అందజేశారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించడం తనకెంతో సంతోషంగా, సంతబుప్తిగా ఉందని సూరా భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ జి.కస్తూరి, నాయకుడు నాగులూరు చిన్నబ్బయ్య, అంగన్‌వాడీ కార్యకర్త సుజాత, హెల్పర్ కుమారి, చిన్నారులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు పద్య పఠన పోటీలు



**మర్రిపాడు, మేజర్‌న్యూస్ :** ప్రపంచ భాషల్లో ఒక తెలుగు భాషలోనే పద్యం ప్రక్రియ ఉంటుందని మరి ఏ ఇతర భాషల్లో ఉండదని అదే మన తెలుగువారిగా మనం గర్వించ దగ్గ విషయమని ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు అభిప్రాయపడ్డారు. కన్నడ రాజైన శ్రీకృష్ణదేవరాయలే దేశభాషలందు తెలుగు లెస్స అని పలికారని గుర్తు చేశారు. 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా గురువారం నాడు మండల కేంద్రంలోని ఎంపీపీ ప్రాథమిక పాఠశాల (బాలుపల్లి) ఐదవ తరగతి విద్యార్థులకు గ్రంథాలయ అధికారి ఆధ్వర్యంలో వేమన, సుమతి, తెలుగు బాల, తదితర శతకాల నుండి పద్య పఠనం పోటీ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా గ్రంథాలయంలోని బాలసాహిత్యానికి చెందిన పుస్తకాలను ప్రదర్శనలో ఉంచారు. ఈనెల 14న జరగవలసిన ఏ1 పరీక్ష బాలల దినోత్సవం సందర్భంగా వాయిదా పడటంతో ఈరోజు నిర్వహిస్తున్నందున వారోత్సవాల ముగింపు, బహుమతి ప్రధాన కార్యక్రమం శుక్రవారం ఉదయం 11 గంటలకు మర్రిపాడు జడ్పీ హైస్కూల్ నందు నిర్వహించనున్నట్లు గ్రంథాలయ అధికారి నారాయణరావు తెలిపారు.

# 5వేలు మించిఉన్న బకాయి దారులకు నోటీసులు ఇవ్వండి : కమిషనర్



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నగరపాలక సంస్థ కమిషనర్ వైఓ నందన్ వారాంతపు సమీక్ష సమావేశంలో భాగంగా గురువారం కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో ఇంజనీరింగ్ విభాగంతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. నగరంలోని బిల్లులు రాని అనాథరైజ్డ్ వాటర్ ట్యాప్స్ ను గుర్తించి వారి వద్ద చలానా రూపంలో నగరపాలక సంస్థ ఖజానాకు జమ చేయించి రెగ్యులర్ చేయించవలసిందిగా ఇంజనీరింగ్ సిబ్బందిని ఆదేశించారు. 2025-26 ఫైనాన్షియల్ సంవత్సరం ముగిసేలోపు నగరపాలక సంస్థ పరిధిలో ఎటువంటి అనాథరైజ్డ్ కొళాయిలు ఉండేదానికి వీలు లేకుండా తగిన చర్యలు చేపట్టాలని ఇబ్బంది ఆదేశించారు. 2025-26 సంవత్సరానికి కొళాయి పన్ను డిమాండ్ 41 కోట్లు అందుకుగాను ఇప్పటివరకు 6.27 కోట్లు మాత్రమే వసూలు చేసి ఉన్నారని, ఇంకా 35 కోట్లు ఐదు నెలల లోపు వసూళ్లు చేయాల్సి ఉందని ఈ సందర్భంగా కమిషనర్ తెలియజేశారు. డిసెంబర్ నెల 13వ తేదీన నేషనల్ లోక్ అదాలత్ జరగనున్నదని ఇందులో భాగంగా నగరంలో ఐదు వేలు, అంతకుమించి బకాయి ఉన్న బకాయిదారులకు నోటీసులు జారీ చేయాలని కార్యదర్శులు, ఫిట్టర్లు, వర్క్ ఇన్స్పెక్టర్లకు కమీషనర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ సమావేశంలో ఎస్‌ఈ రామ్మోహన్ రావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు శేషగిరిరావు, రహంతు జానీ, అనిల్ కుమార్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, సచివాలయ కార్యదర్శులు, ఫిట్టర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

# టీడీపీ పట్టణ అధ్యక్షులుకి జన్మదిన శుభాకాంక్షలు



**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, మాజీ ఏరియా వైద్యశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ గుత్తికొండ కిషోర్‌బాబు గురువారం వారి గృహంలో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యం లో పుట్టిన రోజు ఘనంగా నిర్వహించారు. అనంతరం నాయకులు సాలువతో ఘనంగా సత్కరించి కేకును కట్ చేసి వచ్చిన అభిమానులకు తెలుగుదేశం పార్టీ నాయకులకు కార్యకర్తలకు పంచి పెట్టారు.

# పరిసరాలు పరిశుభ్రత కార్యక్రమం




**కావలి, మేజన్‌న్యూస్ :** కావలి జవహర్ భారతి డిగ్రీ కళాశాలలో రెండు ఎన్ఎస్ఎస్ యూనిట్ల ఆధ్వర్యంలో స్పెషల్ క్యాంపులో భాగంగా రెండో రోజు కావలి శివారులోని పెంకుల ఫ్యాక్టరీ గిరిజన కాలనీలో, కావలి చెరువు సమీపం ఉన్న ఎస్టీ కాలనీలో పరిసరాలు పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.సుబ్రహ్మణ్యం నాయుడు మాట్లాడుతూ.. పరిసరాలు మురికిగా అపశుభ్రంగా ఉన్నట్లయితే అంటు రోగాలు సీజనల్ వ్యాధులు అవకాశం ఉందని ఎవరికి వారు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ఉందని తెలిపారు. అనంతరం కాలనీలో రోడ్డుకి ఇరువైపులా ఉన్న చెత్తాచెదారాన్ని, ముళ్ళకంపలను, ప్లాస్టిక్ వ్యర్థాలను, పిచ్చి మొక్కలను తొలగించారు. రోడ్డు పక్కన ధ్యానం ఉన్న ప్రాంతాల్లో నీరు నిలువ ఉన్న ప్రదేశంలో బ్లీచింగ్ పౌడర్‌ను చల్లారు. ఈ కార్యక్రమం కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ పి.నాగేశ్వరరావు ఎస్.కె అయూబ్ అహ్మద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రామ్ సెంటర్ చైర్మన్ దొడ్ల మనోహర్ రెడ్డి కళాశాల అధ్యాపకులు, కాలనీవాసులు, ఎన్ఎస్ఎస్, వాలంటీర్లు పాల్గొన్నారు.

# సమస్యలను పరిష్కరించాలని వినతి

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** తమ న్యాయమైన సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతూ బ ధవారం ఇన్చార్జి తహసీల్దారు షాజియాకు గ్రామ రెవెన్యూ సహాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామ రెవెన్యూ సహాయకులకు తక్షణమే పేస్కేల్, వేతనాలు పెంచాలన్నారు. అర్హత ఉన్న వారికి వీఆర్ఏ, రికార్డు అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పించాలన్నారు. ఏళ్ల తరబడిగా నామినీలుగా విధులు నిర్వహిస్తున్న వారిని వీఆర్ఎలుగా నియమించాలన్నారు. అటెండర్, నైట్ వాచ్మెన్ పదోన్నతి కోటాను 20 నుంచి 70 శాతానికి పెంచాలన్నారు. అక్రమ నైట్ అటెండర్ డ్యూటీలను రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో దుగ్గయ్య, హజరత్, శ్రీనివాసులు, పిచ్చయ్య, హుస్సేన్‌బాషా, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

# వైద్యవిద్యను పేదలకు దూరం చేస్తున్న ప్రభుత్వంపై ప్రజాఉద్యమం



- సంతకాలసేకరణకు విశేషప్రజాస్పందన
- వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ చిల్లూరు



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** వైద్యాన్ని, వైద్యవిద్యను కూటమి ప్రభుత్వం పేదప్రజలకు, పేద విద్యార్థులకు దూరం చేస్తున్న ప్రభుత్వంపై ఉద్యమాన్ని ఉధృతంగా నిర్వహిస్తామని, తమ పార్టీ చేపట్టిన కోటిసంతకాల సేకరణ కార్యక్రమానికి విశేషప్రజాస్పందన లభిస్తుందని జిల్లా వైసిపి ఉపాధ్యక్షుడు, ఆత్మకూరు మండల మాజీ జెడ్పిటిసి మెంబర్, ప్రముఖ చిన్నపిల్లల వైద్య నిపుణులు డాక్టర్ చిల్లూరు ఆదిశేషయ్య విమర్శించారు. వైసిపి అధినేత జగన్మోహన్‌రెడ్డి పిలుపు, ఆత్మకూరు మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ఆదేశాలతో కోటిసంతకాల సేకరణ కార్యక్రమాన్ని ఆత్మకూరు మున్సిపల్ పరిధిలో 14వవార్డులో గురువారం ముమ్మరంగా నిర్వహించారు. తమ పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఇంటింటికెళ్ళి సంతకాలను సేకరించి వారికి కరపత్రాలందజేసిన డాక్టర్ ఆదిశేషయ్య మాట్లాడుతూ.. తమ అధినేత జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నసమయంలో రాష్ట్రానికి ఎన్నడూలేని విధంగా 17 ప్రభుత్వ మెడికల్‌కాలేజిలను సాధించారన్నారు. కాగా ప్రభుత్వం మెడికల్‌కాలేజిలను కూటమి ప్రభుత్వం ప్రవేటుపరం చేసేలా నిర్ణయించడాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని, తమ అధినేత జగన్మోహన్‌రెడ్డి, తమ నాయకుడు మేకపాటి విక్రమ్‌రెడ్డి ఆదేశాలతో ఆత్మకూరులో ఇంటింటా పర్యటిస్తున్నామని, ప్రవేటీకరణకు వ్యతిరేకంగా ప్రజాభిప్రాయాన్ని సంతకాలద్వారా సేకరిస్తున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వ మెడికల్ కాలేజిలను ప్రవేటీకరణకు కూటమి ప్రభుత్వం పూనుకోవడాన్ని ఆయన తీవ్రంగా విమర్శించారు. ఈప్రవేటీకరణకు వ్యతిరేకంగా తాము పోరాటాలు సాగిస్తామని, అందులో భాగంగా కోటిసంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. నాడు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి రాష్ట్రంలో పేదలందరికి కార్పోరేట్ విద్య, కార్పోరేట్ వైద్యం అందాలన్న సంకల్పంగా ఫీజ్‌రీయంబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ పథకాలు అమలుచేశారని, ఆయన ఆశయసాధనకు వచ్చిన జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక ఈపథకాలను మరింతగా విస్తృతపరిచి అమలు చేశారని, నాడు-నేడు కార్యక్రమంలో విద్యాసంస్థలను రూపురేఖలు మార్చారని, ఇంగ్లీష్‌మీడియం ప్రవేశపెట్టారని, కార్పోరేట్ హాస్పిటల్స్‌లో సేవలతోపాటు గ్రామీణ హెల్త్‌క్లినిక్‌లు ఏర్పాటు చేశారని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో అనాదిగా ఎన్నో ప్రభుత్వాలు వచ్చినా కేవలం 11మెడికల్‌కాలేజిలు మాత్రమే ఉండగా జగన్మోహన్‌రెడ్డి 17మెడికల్‌కాలేజిలను సాధించారని ఆయన వెల్లడించారు. కూటమి ప్రభుత్వం ప్రభుత్వ వైద్యకళాశాలలను ప్రవేటుకు దారాదత్తం చేయడాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తూ ఉద్యమం సాగిస్తామని, ప్రజలనుండి సంతకాలు సేకరిస్తున్నామని, డాక్టర్ చిల్లూరు పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ వైద్యకళాశాలలను ప్రవేటీకరణకు కూటమి ప్రభుత్వం నిర్ణయించడం అత్యంత దుర్మార్గమని, అన్యాయమని, పేదలకు తీవ్ర నష్టదాయకమని ఆయన పేర్కొన్నారు. మెడికల్ కాలేజిలకు అనుబంధంగా సూపర్‌స్పెషాలిటీ హాస్పిటల్స్ కూడా ఉంటాయని, పేదలకు వైద్యవిద్య, వైద్యం లభిస్తాయని తమ నేత జగన్మోహన్‌రెడ్డి రికార్డుస్థాయిలో 17మెడికల్ కాలేజిలు సాధించారని ఆయన పేర్కొన్నారు. అలాంటి ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రవేటీకరణ గావించబూనడం అత్యంత విచారకరమన్నారు. పేదలకు వైద్యవిద్య అందనిద్రాక్షలాగా మారుతుందన్నారు. ఈ ప్రవేటీకరణను తమ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. తమ అధినేత జగన్మోహన్‌రెడ్డి ఆదేశాలు, మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి సూచనలతో తాము పోరాటాన్ని కొనసాగస్తామనిడాక్టర్ ఆదిశేషయ్య పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు డాక్టర్ ఆదిశేషయ్యను ఘనంగా సన్మానించి స్వాగతించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మున్సిపల్ విభాగం రాష్ట్ర ప్రధానకార్యదర్శి అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి, పట్టణ వైసిపి అధ్యక్షుడు నాగులపాటి ప్రతాప్‌రెడ్డి, యువనాయకుడు నోటి వినయ్‌కుమార్‌రెడ్డి, వైసిపి ఎస్‌సిసెల్ రాష్ట్ర కార్యదర్శి కొండా వెంకటేశ్వర్లు, నాయకులు బత్తల మాలకొండయ్య, చిల్లూరు వెంకటేశ్వర్లు, చీర్ల మస్తానయ్య, చిల్లూరు వెంకటరాకేష్, ఈదల ముసలయ్య, ఖాజావలి, పర్వీన్, కల్పన, తోడేటి మణి, తాటిబోయిన సురేష్, చీర్ల శ్రీను, పిన్నిబోయిన మస్తానయ్య, బత్తల మనోజ్, సాజిద్, కప్పల పెంచలయ్య, రహీమ్, పచ్చిపాల సుబ్రహ్మణ్యం, చెరుకూరు అనిల్, ఆది, హర్ష, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## మెడికల్‌కాలేజిల ప్రవేటీకరణ విచారకరం : కౌన్సిలర్ త్రివేణి



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** రాష్ట్రంలోని ప్రభుత్వమెడికల్ కాలేజిలను ప్రవేటీకరణ గావించబూనడం అత్యంత విచారకరమని ఆత్మకూరు మున్సిపల్ కౌన్సిలర్ తుమ్మల త్రివేణి పేర్కొన్నారు. ఆమె వైసిపి అధినేత జగన్మోహన్‌రెడ్డి పిలుపుతో స్థానిక మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ఆదేశాలతో కోటి సంతకాల కార్యక్రమంలో భాగంగా గురువారం 6వార్డు పరిధిలో ప్రజల నుండి సంతకాలు సేకరించారు. ఇంటింటికెళ్ళి సంతకాల ద్వారా ప్రజాభిప్రాయాన్ని సేకరించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వ వైద్యకళాశాలలను ప్రవేటుపరం చేస్తే పేదవిద్యార్థులు వైద్యవిద్యను కోల్పోతారని, పేదప్రజలు వైద్యసేవలకు దూరమవుతారని ఆమె పేర్కొన్నారు. ప్రభుత్వం తన నిర్ణయం మార్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అందుకే ప్రజాభిప్రాయాన్ని కోటిసంతకాల ద్వారా సేకరిస్తున్నామని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు యు.పెంచలయ్య, గుండాల శ్రీకాంత్‌రెడ్డి, యడ్ల విష్ణువర్ధన్‌రెడ్డి, రఫీ, శేషారెడ్డిలు సంతకాలను సేకరించగా పలువురు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## బంగారుకుటుంబ యోగక్షేమాలు తెలుసుకున్న మంత్రి ఆనం



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ప్రభుత్వం అమలుచేస్తున్న పి4పథకం ద్వారా బంగారు కుటుంబంగా ఎంపికైన బొమ్మిరెడ్డి మల్లేశ్వరి కుమారుడు బాలును రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పరామర్శించారు. ఇటీవల వికలాంగుడైన ఆ బాలుడు తనకు కృత్రిమకాలు కావాలని, ఆదుకోవాలని మంత్రి ఆనంను కోరగా ఆదుకుంటామని ఆయన హామీ ఇవ్వగా మంత్రి ఆనం కుమార్తె కైవల్యారెడ్డి ఆకుటుంబాన్ని దత్తత తీసుకుంది. ఆత్మకూరుకు బుధవారం విచ్చేసిన దేవాదాయశాఖా మంత్రి రామ నారాయణరెడ్డి బాలు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అన్నివిదాలా తాము ఆదుకుంటామని మంత్రి భరోసా ఇచ్చారు. ఈకార్యక్రమంలో నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆర్డీవో భూమిరెడ్డి పావని, తహశిల్దారు పి.పద్మజాకుమారి, పలువురు అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి ఆనం చొరవతో బైపాస్‌రోడ్డుకు మహర్ధశ.. స్టేడియంకు వీడిన గ్రహణం

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు ఎమ్మెల్యే, రాష్ట్ర దేవాదాయశాఖా మాత్యులు ఆనం రామనారాయణరెడ్డి ప్రత్యేక చొరవ, శ్రద్ధ, పట్టుదలతో స్థానిక బైపాస్‌రోడ్డుకు మహర్ధశ కలుగనుంది. అలాగా 12సంవత్సరాల క్రితం నిర్మాణపనులు నిలిచిపోయిన స్పోర్ట్స్ స్టేడియంకు గ్రహణం వీడిపోనుంది. గతంలో ఆత్మకూరు ఎమ్మెల్యేగా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఆర్థికశాఖా మంత్రిగా వేలకోట్ల రూపాయలతో ఆత్మకూరును అభివృద్ధిపరిచి, రెవిన్యూ డివిజన్, మున్సిపాలిటీ తదితర సంస్థలను, భవనాలు, రోడ్లను, విభిన్నతరహా విద్యాసంస్థలను సాదించి ఆత్మకూరు అభివృద్ధి ప్రదాతగా పేరుగాంచిన ఆనం రామనారాయణరెడ్డి పట్టుబడితే కానిపనిఏదీ ఉండబోదన్న ప్రగాఢ విశ్వాసం ప్రజల్లో మెండుగా ఉంది. ఆయన ఈదపా మళ్ళీ ఆత్మకూరు ఎమ్మెల్యే రాష్ట్ర దేవాదాయశాఖామంత్రి పదవిని చేపట్టి గత దశాబ్దకాలంగా నిలిచి పోయిన ఆత్మకూరు నియోజకవర్గ అభివృద్ధిని పట్టాలెక్కించి పరుగులు తీయిస్తున్న విషయం తెల్సిందే. అందులో భాగంగా నెల్లూరు-ముంబాయి జాతీయ రహదారిపై నుండి ఆత్మకూరు పట్టణంలోని వచ్చే శ్రీఅభయాంజనేయస్వామి విగ్రహంవద్దనుండి ఉన్న బైపాస్‌రోడ్డును నాలుగులైన్లుగా విస్తరించేందుకు, డివైడర్లు, సెంట్రల్‌లైటింగ్, ఇరువైపులా వాకింగ్‌ట్రాక్స్ ఏర్పాటుకు 6కోట్ల రూపాయల నిధులను ఆయన సాధించారు.పనులు కూడా ప్రారంభమయ్యాయి. ఇంకా 2కోట్ల రూపాయలు అవసరమని గుర్తించి ఆ నిధులను కూడా మంజూరు చేయిస్తానని ప్రకటించారు. ఆత్మకూరులో గతంలో రామనారాయణరెడ్డి కోటిరూపాయలతో మంజూరు చేయించిన స్పోర్ట్స్ స్టేడియం పనులు కేవలం 38లక్షలతో చేసి 12సంవత్సరాలుగా పనులు నిలిపివేయగా ఎవరూ పట్టించుకోలేదు. దాన్ని గుర్తించిన మంత్రి ఆనం వెంటనే ప్రభుత్వం దృష్టికి, క్రీడాప్రాధికారసంస్థ దృష్టికి



తీసుకెళ్ళి 1.8కోట్ల రూపాయల నిధులను మంజూరు చేయించారు. ఆయన బుధవారం బైపాస్‌రోడ్డుపనులను, నిర్మాణం నిలిచిపోయిఉన్న స్టేడియంను సంబంధిత అధికారులు, ఇంజనీర్లతో పరిశీలించి వారితో సమీక్షించారు. బైపాస్‌రోడ్డును నాలుగులైన్లుగా విస్తరించేలా, డివైడర్లు, సెంట్రల్‌లైటింగ్‌తో పనులు జరుగుతున్నాయని, ఇప్పటికే 6కోట్ల రూపాయల నిధులు మంజూరు చేయించామని, మరో 2కోట్ల రూపాయలు కూడా అవసరమవుతాయని, వాటిని కూడా మంజూరు చేయిస్తామని, గడువుకు ముందే ఈరోడ్డు విస్తరణ, ఆధునీకరణ పనులు పూర్తయ్యేలా చూస్తామన్నారు. స్టేడియం నిర్మాణపనులు నిలిచిపోయి ఉండగా 1.8కోట్ల రూపాయలు మంజూరు చేయించానని, గతంలో 10ఎకరాల స్థలం స్టేడియంకు కేటాయించగా ఇంకా అవసరంమేరకు మరో 10ఎకరాలను కూడా కేటాయించాలని రెవిన్యూ అధికారులను కోరామని ఆయన పేర్కొన్నారు. వాటర్‌ప్లాంటు గతంలో ఏర్పాటు చేయించగా పెరిగిన జనాభా ప్రకారం అందరికీ సమృద్ధిగా తాగునీరందించేందుకు అదనంగా నిధులు మంజూరు చేయిస్తానని ఆయన పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో ఆత్మకూరు ఆర్డీవో భూమిరెడ్డి పావని, స్థానిక తహశిల్దారు పి.పద్మజాకుమారి, ఎంపిడివో రఫీఖాన్, మున్సిపల్ కమీషనర్ సి.గంగాప్రసాద్, సోమశిల ప్రాజెక్టుకమిటీ చైర్మెన్ వేలూరు కేశవచౌదరి, నియోజకవర్గ తెలుగుదేశం నాయకులు తాళ్ళూరు గిరినాయుడు, కాటంరెడ్డి రవీంద్రారెడ్డి, ఆత్మకూరు మండలాధ్యక్షుడు కేతా వేణుగోపాల్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ గోపారం వెంకటరమణమ్మ, తెలుగుదేశంకు చెందిన పలువురు కార్పోరేషన్ డైరెక్టర్లు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, దావా పెంచలరావు, పులిమి శైలజారెడ్డి, కౌన్సిలర్లు తుమ్మల చంద్రారెడ్డి, సుంకరపెంచలచౌదరి, కేతా విజయభాస్కర్‌రెడ్డి, గార్లపాటి వేణుగోపాల్‌నాయుడు, పిడికిటి వెంకటేశ్వర్లునాయుడు, తోడేటి వెంకటయ్య, సర్దార్, మెటుకూరు కృష్ణారెడ్డి, యర్రమల్లచిన్నారెడ్డి, అబ్బూరు రమేష్‌నాయుడు, దేవరాల గంగాధర్‌యాదవ్, సూరా భాస్కర్‌రెడ్డి, శివకోటారెడ్డి, మహబూబ్‌బాషా, గంధళ్ళ వేణు, పరిటాల సత్యనారాయణ, కొప్పోలు చిన్నపురెడ్డి, ఆనం ప్రసాద్‌రెడ్డి, గంగపట్నం చంద్రశేఖరయ్య, హయత్‌బాషా, గోరీ షబ్బీర్, అన్నలూరు శ్రీనివాసులునాయుడు, వేళ్ళ సుమతి, మునగపాటి సునీత, పొన్నూరు హజరత్తయ్య, తలచీరు బాబునాయుడు, యర్రంరెడ్డి నాగమోహన్‌రెడ్డి, శాఖమూరు నారాయణ, చీర్ల వెంకటేశ్వర్లు, చిట్టమూరు వెంకటేశ్వర్లురెడ్డి, తోట సుబ్బారావు, కొల్లి నరసయ్యానాయుడు, గుండ్లపల్లి శ్రీనివాసయాదవ్, సుదర్శన్‌రెడ్డి, నలిశెట్టి శ్రీనయ్య, ఖాజావలి, కొండ్రెడ్డి రమణారెడ్డి, బీజేపీ నాయకులు కుడుముల సుధాకర్‌రెడ్డి, నున్నా సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# సహకారసంఘ సభ్యులలో సహకార స్ఫూర్తి రావాలి : కలెక్టర్




**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** సహకార సంఘాల సభ్యుల మధ్య మంచి అవగాహన ఉన్నప్పుడే సహకార సంఘాల ద్వారా ప్రజలకు అత్యున్నత స్థాయిలో సేవలు అందించవచ్చునని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా అభిప్రాయపడ్డారు. గురువారం నెల్లూరు కలెక్టర్ కార్యాలయంలోని తిక్కన ప్రాంగణంలో 72వ అఖిల భారత సహకార వారోత్సవాలు-2025 ముగింపు సందర్భంగా సహకార శాఖ ఆధ్వర్యంలో తిక్కన ప్రాంగణంలో కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా మాట్లాడుతూ సహకార సంఘాలు వారి సభ్యుల మధ్య సరి అయినా అవగాహనతో సేవా దృక్పథం తో పాటు ఆ ప్రాంత సమస్య గుర్తించి దాని పరిష్కారానికి కృషి చేయాలన్నారు. అప్పుడే సొసైటీలు బలోపేతం అవుతాయని ఆయన అన్నారు. సహకార సంఘాలలో వ్యక్తిగత అభిప్రాయాలకు తావు ఇవ్వకుండా అందరూ సమన్వయంతో సమిష్టిగా పనిచేయాలన్నారు. ఒక్కొక్క ప్రాంతంలో ఒక సమస్య ఉంటుందని ప్రాంతాలను బట్టి సహకార సంఘాలు సమస్యల పరిష్కారానికి కృషి చేసి ప్రజలకు మేలు చేయాలన్నారు. సహకార సంఘాలకు సంబంధించి ప్రతి ఆరు నెలలకు గాని మూడు నెలలకు గాని సమావేశం ఏర్పాటు చేసుకోవడంతో పాటు వచ్చిన ఆదాయాన్ని సభ్యులందరికీ సమపాళ్లలో పంచవలసిన అవసరం ఉందన్నారు. చేసే పని ఏదైనా నాణ్యతగా ఉండాలని ఆయన అన్నారు! సహకార సంఘాల పరిధిలో పనిచేసే రైతులందరూ ఒక ఉపయోగపడే కారణంతో పనిచేయాలన్నారు. అప్పుడే సహకార సంఘాలు మూమెంట్ ముందుకు వెళుతుందని అభిప్రాయపడ్డారు. గ్రూపులు ఏర్పడేటప్పుడు మొదటినుంచి సరైన పునాదితో ఏర్పడాలని ఆయన అన్నారు. ప్రతి గ్రామానికి ప్రతి మనిషికి అభిప్రాయాలలో పనులలో వ్యత్యాసం ఉంటుంద వాటిని గుర్తించి సేవలు చేయాలని ఆయన అన్నారు. సహకార సంఘాలలో చైతన్యం స్వాతంత్రం వచ్చిన తర్వాత బలపడిందని దానికి ముందు విదేశీ పరిపాలనలో 200 సంవత్సరాల గడిచిపోయాయని ఆయన అన్నారు. అనంతరం జిల్లా కో-ఆపరేటివ్ అధికారి గురప్ప మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో నవంబర్ 14 నుంచి 20 వరకు ఆకార వారోత్సవ నిర్వహించడం జరిగిందన్నారు. ఐక్యరాజ్యసమితి సూచనలు మేరకు 2025 సంవత్సరాన్ని సహకార సంవత్సరంగా గుర్తించడం జరిగిందన్నారు. ఒక వ్యక్తి గౌరవప్రదమైన జీవనాన్ని గడపాలంటే సహకార సంఘాల కృషి ఎంతో అవసరమని ఆయన అన్నారు. ఎరువులు పంపిణీలో సహకార సంఘాలు కృషి చేశాయని తెలిపారు. దేశం మొత్తం మీద 8.50లక్షల సహకార సంఘాలు ఉన్నాయన్నారు. కేరళ రాష్ట్రం పేదరిక రహిత రాష్ట్రంగా గుర్తించడానికి కారణం సహకార సంఘాలు అనిబ్ఆయన తెలిపారు. రాజ్య సమితి 2012లో ఒకసారి అంతర్జాతీయ సహకార సంవత్సరంగా గుర్తించడం జరిగిందన్నారు. డీసీసీబీలు, పీఏసీలు, సహకార సంఘ సొసైటీలు సహకార సంఘాల బలోపేతానికి కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా, అత్యుత్తమ సేవలు అందించిన సహకార సంఘాలు, సహకార శాఖ సిబ్బందికి మెమెంటోలు, ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో డీసీసీబీ సీఈఓలు, డివిజనల్ అధికారులు, సహకార సంఘాల ప్రెసిడెంట్లు తదితరులు హాజరయ్యారు.

# అభివృద్ధికి పట్టం కట్టిన కూటమి ప్రభుత్వం



**కలిగిరి/వింజమూరు, మేజర్‌న్యూస్ :** కలిగిరి మండలం వెలగపాడు పంచాయతీలో సంగం-కలిగిరి రహదారి నుండి కొత్తూరు గ్రామానికి నాబార్డ్ ఆర్ఐడిఎఫ్ నిధుల సహకారంతో రూ.1.75కోట్ల వ్యయంతో నిర్మించిన

### రూ.1.75కోట్ల నాబార్డ్ నిధులతో కొత్తూరు రహదారి ప్రారంభం

నూతన రహదారి ప్రారంభోత్సవానికి ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పాల్గొని, శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాకర్ల సురేష్ మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్ర అభివృద్ధిలో రహదారుల ప్రాధాన్యతను గుర్తించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రత్యేక దృష్టి సారించగా, పాడైపోయిన రహదారుల మరమ్మత్తులు చేపట్టడమే కాకుండా అవసరమైన చోట కొత్త రహదారుల నిర్మాణానికి కూడా ప్రాధాన్యత ఇచ్చారు. ప్రజలు ప్రయాణంలో ఎటువంటి ఇబ్బందులు ఎదుర్కొనకుండా ఉండేందుకు ప్రభుత్వం సమగ్ర కార్యాచరణను అమలు చేస్తూ అభివృద్ధి పట్ల తమ కట్టుబాటును మరోసారి చాటుకుంది. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, కార్యకర్తలు కూటమి కుటుంబ సభ్యులు అధికారులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

### కలెక్టర్ చేతుల మీదగా..

## ఉత్తమ అవార్డు అందుకున్న అమ్మినేని



**సైదాపురం, మేజర్‌న్యూస్ :** సహకార సంఘాల వారోత్సవాల్లో భాగంగా సైదాపురం మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడు అమ్మినేని సుబ్రమణ్యం నాయుడుకి, సొసైటీ సీఈఓ బంకాపురి శ్రీనుకి రైతుల అభివృద్ధి సహకార సంఘాల లక్ష్యంగా గ్రామ వ్యవస్థ బలపడితేనే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ మరింత బలపడుతుంది. సంఘం ద్వారా రైతులకు అర్హతను బట్టి రుణాలు ఎరువులు విత్తనాలు ధాన్యం కొనుగోలు సేవలు పారదర్శకంగా పనిచేస్తున్నటువంటి సంఘాలను గుర్తించి జిల్లా కలెక్టర్ హిమాన్ష చేతుల మీదగా బెస్ట్ అవార్డు తీసుకోవడం తీసుకోవడం జరిగిందని సొసైటీ శివ బంకపరి శ్రీను తెలిపారు.

## శివాలయం అర్చకునికి చిరు సన్మానం



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** ఉదయగిరి పట్నంలోని పార్వతి పరమేశ్వర ఆలయ అర్చకులు బద్దెపూడి అనిల్ శర్మను గురువారం శివాలయ ప్రాంగణంలో పలువురు గురు స్వాములు చిరు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కార్తీక మాసాన్ని పురస్కరించుకొని పట్టణ పరిధిలో అయ్యప్ప, ఆంజనేయ, శివయ్య, గోవింద కఠోర నియమ నిష్ఠలతో మాలలు ధరించిన గురు స్వాములు, కన్నె స్వాములు, ఇతర స్వాములకు ప్రతిరోజు ఉదయం అల్పాహారం అందించేందుకు పలువు రిని ప్రోత్సహించి సహకరించి కొనసాగిం చారు. ఇలాంటి వ్యక్తులు సమాజంలో ఉండడం సంతోషకరమన్నారు. అనంతరం ఆయనను శాలువ, పూలమాలతో సన్మానించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో గురు స్వాములు బాలాజీ, హరి వెంకట ప్రసాద్, వెంకటాద్రి, శ్రీనివాసులు, హరి, విజయ్, హరీష్, మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఉత్తమ సీఈఓగా రమణమూర్తి

▸ **జిల్లా కలెక్టర్ చేత సత్కారం**



**తోటపల్లి గూడూరు, మేజర్‌న్యూస్ :** అఖిలభారత సహకార వారోత్సవాల ముగింపు సందర్భంగా నెల్లూరులోని కలెక్టర్ కార్యాలయంలో తిక్కన భవనంలో జరిగిన కార్యక్రమంలో పేడూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ముఖ్య కార్యనిర్వాహణాధికారి పీవీ రమణమూర్తికి ఉత్తమ సీఈఓ అవార్డు అందజేశారు. జిల్లాలో సహకార వ్యవస్థ బలోపేతానికి, రైతులకు దగ్గరగా నిలిచి సేవలందించినందుకు ఈ పురస్కారం కలెక్టర్ హిమన్షు శుక్ల చేత అందించబడింది. కార్యక్రమంలో జిల్లా సహకార శాఖాధికారి గురప్ప, జిల్లా సహకార వ్యవహారాల అధికారి తిరుపాల్ రెడ్డి, నెల్లూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు నిర్వాహకుడు వెంకటేశ్వరరావు, జిల్లా లీగల్ సెల్ అధికారిని వెంకటేశ్వర్లు, పలు సహకార సంఘాల సీఈఓలు, శాఖ సిబ్బంది పాల్గొన్నారు. పేడూరు సహకార సంఘం సిబ్బంది రమణమూర్తిని అభినందిస్తూ, ఆయన నేతృత్వంలో సంఘ అభివృద్ధి మరింత పురోగమిస్తుందని పేర్కొన్నారు.

## 1వ డివిజన్‌లో లేఔట్‌ను పరిశీలించిన కమిషనర్



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వైఓ నందన్ స్థానిక 1వ డివిజన్ నవలాకులతోట ప్రాంతంలోని లేఔట్ ను పట్టణ ప్రణాళిక విభాగం అధికారులతో కలిసి గురువారం పరిశీలించారు. ఎల్ఆర్ఎస్ పథకం ద్వారా లేఔట్ ను క్రమబద్ధీకరించే అవకాశాలను, అనుమతులను కమిషనర్ పరిశీలించి టౌన్ ప్లానింగ్ అధికారులకు వివిధ సూచనలు జారీ చేశారు. అనంతరం స్థానిక 12వ డివిజన్లోని శ్రీకరం లేఔట్‌ను ఎల్ఆర్ఎస్ అనుమతుల కోసం కమిషనర్ పరిశీలించారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ విభాగం సిటీ ప్లానర్ హిమబిందు, డీసీపీ రఘునాథరావు, ఏసీపీ మురళి, వార్డు సచివాలయ కార్యదర్శులు, లేఔట్ యజమానులు, సిబ్బంది పాల్గొన్నారు.

## అయ్యప్ప స్వామి మండల పూజలు



**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు వేదాయపాలెంలో వేంచేసి ఉన్న వేద శాస్త్ర శ్రీ స్వామి అయ్యప్ప స్వామి దేవస్థానంలో అయ్యప్ప స్వామి వారికి కేరళ సాంప్రదాయ మండల పూజలు గురువారం జరిగాయి. తొలుత అయ్యప్ప స్వామి వారి నిర్మాల్య దర్శనం పాలాభిషేకం, మహాగణపతి హెూమం, స్వామి వారికి ఉషః పూజ, శ్రీ వేలి ఉత్సవం, కలశపూజ,నవకాభిషేకం, ఉచ్చ పూజ, శ్రీ వేలి ఉత్సవం, సాయంత్రం పూలంగి సేవ దర్శనం, మహాదీపారాధన, భగవతి సేవ, అత్తలపూజ, శ్రీవేలి ఉత్సవం, పడి కర్పూర దీపం, హరిహరాసనం అయ్యప్ప స్వామివారి సేవలు కేరళ సాంప్రదాయంలో జరిగాయి. ఈ కార్యక్రమానికి బొచ్చు కృష్ణమూర్తి ఝాన్సీ రాణి దంపతులు ఉభయకర్తలు కాగా మధ్యాహ్నం అయ్యప్ప స్వాములకు భక్తులకు అన్నదాన కార్యక్రమంకు చెరుకూరు జయరామయ్య పద్మావతమ్మ దంపతులు, బొమ్మ సుబ్బరామిరెడ్డి వకుళ దంపతులు, వేగూరు రవితేజ చంద్రిక దంపతులు, శ్యామ్ కుమార్ జ్యోతి దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. అధ్యక్షులు గూడల శేషగిరిరావు, కార్యదర్శి కత్తుల వెంకటరత్నం, కోశాధికారి గడ్డం రత్నయ్య పర్యవేక్షణలో జరిగాయి కమిటీ సభ్యులు కేజీ శంకరన్, బొగ్గుల మురళీమోహన్ రెడ్డి, పావలా ప్రసాద్, అశోక్ చంద్ర పలువురు అయ్యప్ప స్వామి భక్తులు పాల్గొన్నారు.

# మంత్రాలయంలో రాఘవేంద్ర స్వామి దర్శించిన కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి



**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి గురువారం మంత్రాలయంలోని శ్రీ రాఘవేంద్ర స్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్వామివారి దర్శనం చేసుకొని, స్వామి వారి రథోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. కావలి నియోజకవర్గ ప్రజలు రాఘవేంద్ర స్వామి కృప దయలతో ప్రజలంతా చల్లగా, ఆనందంగా, సంతోషసమృద్ధులతో జీవించాలని మనస్ఫూర్తిగా కోరుకున్నారు.








## బాలల హక్కులపై అవగాహన పెంచుకోవాలి

▶ సామాజికవేత్త మాలకొండ రెడ్డి



**జలదంకి, మేజర్‌న్యూస్ :** సమాజంలో బాలల హక్కుల పై అవగాహన కల్పించి విద్యా హక్కు చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని లోక్ అదాలత్ సభ్యులు ఎం.మాల కొండారెడ్డి పేర్కొన్నారు. ప్రపంచ బాలల హక్కుల దినోత్సవం సందర్భంగా మాలకొండారెడ్డి మాట్లాడుతూ.. బడి బయట పిల్లలను పాఠశాలలో చేర్పించాలని కోరినారు. తల్లిదండ్రుల అవగాహన లోపం వల్ల బాలబాలికలు బడి బయట తిరుగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఐక్య రాజ్యసమితి 1989 నవంబర్ 20 న ప్రపంచ బాలల హక్కుల దినోత్సవం గా ప్రకటించారు.బాల బాలికలను పాఠశాలలో చేర్పించి విద్యాహక్కు చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని కోరారు. బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించడానికి లెక్క లేనన్ని చట్టాలు అమల్లో ఉన్నప్పటికీ బాల కార్మిక వ్యవస్థ పెరుగుతూనే ఉందని,ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు పౌర సంస్థలు కలిసికట్టుగా కృషి చేసి బాలల హక్కులను పరిరక్షించి బాలబాలికలను పాఠశాలకు పంపాలని కోరినారు.సమాజంలో బాల బాలికలను హొటల్లో గాని ఫ్యాక్టరీలో గాని షాపుల్లో గాని పనిచేయించుకోవడం నేరమన్నారు. విద్యాహక్కు చట్టంపై ప్రజలకు అవగాహన పెంపొందించి బాల బాలికలను ఉన్నత విద్యను అభ్యసించడానికి ప్రోత్సహించాల్సిన బాధ్యత సమాజంపై ఉందన్నారు. దీని కొరకు మేధావులు ఉద్యోగులు తల్లిదండ్రులు నిరంతరం కృషి చేయాలి అన్నారు.

## పరామర్శ



**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి రూరల్ మండలం అన్నగారిపాలెం పంచాయతీ వెంకటేశ్వరపురం గ్రామంలో కోడూరు బాబును ఆయన కుటుంబ సభ్యులను కావలి సీనియర్ నాయకులు మన్నెమాల సుకుమార్ రెడ్డి పరామర్శించారు. కోడూరు బాబు మాతృమూర్తి జయమ్మ కాలం చెందారు. గ్రామానికి చేరుకున్న మన్నెమాల సుకుమార్‌రెడ్డి బాబు కుటుంబ సభ్యులను పరామర్శించారు.